


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 21-06-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 269 పేజీలు : 8 వెల : 1 రూపాయి



# కృష్ణా డెల్టాకు జలసిరులు

- కృష్ణా డెల్టా ఆధునీకరణ పనుల పైలాన్ ఆవిష్కరణ
- డెల్టా నీటితో భూగర్భ జలాల పెంపు
- కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేసిన చంద్రబాబు

అమరావతి: ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా డెల్టాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం నీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, శాసన సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు బుద్దా వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కృష్ణా డెల్టా తూర్పు ప్రధాన కాలువపై కొత్తగా నిర్మించిన నియంత్రిక ద్వారా సీఎం నీరు విడుదల చేశారు. దీనిద్వారా రోజుకు వెయ్యి క్యూసెక్కుల నీరు బ్యారేజీ నుంచి కృష్ణా తూర్పు కాలువ ద్వారా విడుదల చేయనున్నారు. కృష్ణా కాలువలో ముఖ్యమంత్రి గంగపూజ నిర్వహించారు. గతేడాది కంటే వారం రోజుల ముందే కాలువలకు నీరు విడుదల చేసినట్లు తెలిపారు.

కృష్ణా డెల్టా ఆధునీకరణ పనుల పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. కృష్ణా తూర్పు డెల్టాలో 7.36లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. పశ్చిమ డెల్టా కాలువకు మరో రెండు రోజుల తర్వాత సాగునీరు విడుదల చేయనున్నారు. కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ ఏడాది జీరో అవుట్ ఫ్లో ఉందని.. చరిత్రలో ఇలాంటి దారుణమైన పరిస్థితి తొలిసారని సీఎం వ్యాఖ్యానించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కృష్ణా నది ద్వారా బ్యారేజీకి నీరు రావడం లేదన్నారు. కృష్ణా నదిపై ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టులు పెరిగి కిందకు నీరు వచ్చే పరిస్థితి లేదని కొన్నేళ్లుగా కృష్ణా డెల్టాలో అదను తప్పి సాగు చేయాల్సిన పరిస్థితి ఎదురైందని.. పట్టిసీమ నిర్మాణం ద్వారా ఈ సమస్య అధిగమించామన్నారు. గోదావరి నుంచి పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కాలువలకు నీరిస్తున్నామని... ముందుగా నీటి విడుదల వల్ల తుఫానులు రాకముందే పంట చేతికొస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా నీరు అందించే ఏర్పాట్లు చేయ తరువాయి 2లో..





## అంగన్వాడీలకు వరాల జల్లు

### భారీగా వేతనాల పెంపు .. త్వరలోనే స్మార్ట్ ఫోన్లు

### అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వేతనాలను భారీగా పెంచుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతిలో తన నివాసంలోని ప్రజాదర్బార్ హాలులో సాధికార మిత్రలతో జరిగిన సమావేశంలో ఆయన అంగన్ వాడీలపై వరాల జల్లు తరువాయి 2లో..

## అన్నింటా అవినీతే.. రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు



### అవినీతి బయటకు రాకూడని ఉత్తుత్తి ధర్నాలు చేస్తున్నారు

### బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు

విశాఖపట్నం: గత నాలుగేళ్ల కాలంలో ఆంధ్రా ప్రదేశ్ రాష్ట్రాన్ని గుంపగుత్తగా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు దోచుకున్నారని తరువాయి 2లో..

## సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట



వార్త 2వ పేజీలో..

## నేడు విశాఖలో సీఎం చంద్రబాబు పర్యటన

విశాఖ సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేడు విశాఖలో పర్యటించనున్నారు. నగరంలో ఏడు గంటల పాటు ఆయన పర్యటన కొనసాగనుంది. ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నానికి చేరుకుంటారు. నేరుగా రుషికొండలోని సాయిప్రియా రిసార్ట్స్ చేరుకుని వుడా అభివృద్ధి చేసిన అమృత వ్యాలీని ప్రారంభిస్తారు. 12 గంటలకు అక్కడే ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య ఉత్సవ్‌ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు సాయిప్రియా రిసార్ట్స్ నుంచి బయలు దేరి పోర్టు అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. నగరంలో తొమ్మిది వేల మందికి నివాస స్థలాలను రెగ్యులరైజ్ చేసే కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో గాజువాకకు చెందిన ఐదు వేల మందికి నివాసాలను క్రమబద్ధీకరించనున్నారు. సాయంత్రం 5 గంటల వరకు సభ నిర్వహణ ఉంటుంది. సాయంత్రం 5.25 గంటలకు తిరిగి ప్రత్యేక విమానంలో విజయవాడ తిరుగు ప్రయాణమవుతారు.

## చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేస్తాం

- నేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తా
- కార్మికులకు పింఛన్లు, విద్యార్థులకు పాఠశాల ప్రవేశ పత్రాలు అందజేత
- ఏపీ మంత్రి నారా లోకేష్

చీరాల : అర్హుడైన ప్రతి చేనేత కార్మికుడి రుణాన్ని మాఫీ చేస్తామని ఏపీ మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళవారం ఆయన చీరాలలో పర్యటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక వస్త్రాలకు ప్రత్యేకమైన స్థానం ఉందని గుర్తు చేశారు. నేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

వేటపాలెం చేనేత పురిలో నేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. 90 మంది కార్మికులకు పింఛన్లు, విద్యార్థులకు కస్తూర్బా పాఠశాల ప్రవేశ పత్రాలు అందజేశారు.




### దేశంలోనే తొలిసారిగా

## విశాఖలో హెల్త్ ఫెస్టివల్

### రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య



విశాఖపట్నం: దేశంలోనే తొలిసారిగా విశాఖ నగరంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఫెస్టివల్‌ను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య తెలిపారు. దేశ, విదేశాల్లో ఉన్న అత్యుత్తమ వైద్య సేవలను గుర్తించి రాష్ట్రంలో వాటిని అమలు పరిచే విధంగా ఈ హెల్త్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ విధానం అమలు చేయడం ద్వారా నిరుపేదలకు కూడా మెరుగైన వైద్యం అందడంతో పాటు వైద్య ఖర్చులు కూడా బాగా తగ్గే అవకాశముంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె హెల్త్ ఫెస్టివల్ ప్రాధాన్యతను వివరించారు. రుషికొండ లోని తరువాయి 2లో..



# లింగవివక్షను అధిగమించడానికి అవగాహన కల్పన

**- మహిళా సాధికారత సాధించేందుకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు.**
**- సమాజంలో సమానత్వానికి లింగవివక్షను అధిగమించాలి**
**- పంచాయతీరాజ్ రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ గంగాభవాని**


మాట్లాడుతున్న గంగాభవానీ

నర్సీపట్నం : సమాజంలో మహిళల సమానత్వం సాధించాలంటే లింగవివక్షను అధిగమించాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ గంగాభవాని సూచించారు. రెండు రోజులపాటు అంగన్వాడి స్వయం సహాయక సంఘాలు, వార్డ్ మెంబర్ లకి నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది స్థానిక నవనిర్మాణ సమితి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలలోని మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు ఇంటి స్థలం, చంద్రన్న బీమా, పెళ్ళికానుక ఇలా అన్ని పథకాలను మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు మహిళ సాధికారతకి డ్వాక్రాని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఫెసిలిటేటర్ అనిత, డిఎల్పిఒ కార్యాలయ సిబ్బంది వెంకటేష్ ఏడు మండలాల నుండి అంగన్వాడీలు ఆశ డ్వాక్రా సంఘాలంగాల లీడర్లు పాల్గొన్నారు.

# ఇళ్ళు లేని పేదవారికి ఇళ్ళు ఉండాలి

భీమునిపట్నం : ఇళ్ళు లేని పేదవారికి ఇళ్ళ ఉండాలనే లక్ష్యం తో ప్రతీ కార్యకర్త పని చేయాలని భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు అన్నారు. స్థానిక గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం లో ఆయన ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇళ్లు అందాయని, అంతే కాకుండా ఇంకా ఎవరు అర్హులైన వారు ఉన్నారో గుర్తించి వారికి ఇళ్ళు అందేవిధంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు.అంతే కాకుండా ప్రభుత్వం మంజురుచేస్తున్న పథకాలను ప్రజలకు తెలియపరిచేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు 50ఏళ్ళు దాటిన ఒంటరి మత్స్యకారమహిళకు పెన్షన్, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. బిసి, ఎస్సీ, కాపు,మైనారిటీ కార్పోరేషన్ లోన్స్ లబ్ధిదారులు ఎక్కువ ఉండడం వలన యూనిట్లు అత్యధికంగా పెంచాలని గంటా శ్రీనివాసరావును కోరుతూ తీర్మానం చేయడం జరిగినట్లు తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్, నాయకులు పెంటపల్లి యోగీశ్వర్రావు, మారోజు సంజీవ్ కుమార్,కోండ్రు కృష్ణ, కాసరపు నాగరాజు, కె.అప్పలనాయుడు, డక్కన్ శ్రీను, ఊళ్ళ దుర్గారావు, పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు జిల్లాల జాయింట్ కలెక్టర్లతో కమిటీ సమావేశం



విశాఖపట్నం: రెవెన్యూశాఖలో ముఖ్యమైన సర్వీసులలో మెరుగైన సేవలు అందించి, తద్వారా ప్రజల యొక్క సంతృప్తికర సూచికను పెంపొందించుటకుగాను సదరు ముఖ్యమైన సర్వీసులను అధ్యయనం చేసి సూచనలు ఇచ్చుటకు ముఖ్య కమిషనరు. భూపరిపాలన, విజయవాడవారు ఐదు జిల్లాల జాయింట్ కలెక్టర్లతో ఒక కమిటీని నియమించడమైనది. సదరు కమిటీలో జాయింట్ కలెక్టర్, శ్రీకాకుళం జిల్లా వారు ఛైర్మన్గా, విశాఖపట్నం, తూర్పు గోదావరి, కర్నూలు, చిత్తూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు మెంబర్లుగా నియమించడమైనది. పైన తెలిపిన ఐదు జిల్లాల జాయింట్ కలెక్టర్లు అయిన కెవిఎన్.చక్ర ధర్బాబు, జి.సృజన, ప్రసన్న వెంకటేష్, మల్లిఖార్జున్, గిరీష్ తదితరులు బుధవారం ప్రభుత్వ అతిధి గృహమందు హాజరై 22-ఏ ప్రభుత్వ భూముల జాబితా మార్పులు-చేర్పులు గూర్చి, వెబ్ల్యాండ్ నందు మ్యుటేషన్, ఆటో మ్యుటేషన్ గూర్చి, అనాదీనం భూములు, నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చుటకు, భూదార్, సాదా బినామీ కేసులు, ఎఫ్ఎంబి డిజిటల్యజేషన్, నోషనల్ సబ్ డివిజన్, కుల ధ్రువ పత్రములు మొదలగు రెవెన్యూ శాఖల సర్వీసులను చర్చించుకుని నివేదికను ముఖ్య కమిషనర్, భూ పరిపాలన, విజయవాడ వారికి పంపడమైనది.

# రాజభాష హిందీకి ప్రోత్సాహం



విశాఖపట్నం: బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలందు అధికార భాష హిందీ వాడకం ప్రోత్సహించే దృష్టితో బ్యాంక్ ఆఫ్ బరోడా 'ఇంటర్- బ్యాంక్-మెమరీ రిటెన్ కాంపిటీషన్'ను బుధవారం విశాఖపట్నం వద్ద బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ కార్యాలయం నందు టోలిక్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ శేషగిరిరావు మాట్లాడుతూ హిందీ మనదేశం యొక్క అధికార భాష అని, ఈ భాష లిపి తేలికైనది, సులభమైనదని అన్నారు. టోలిక్ బ్యాంకుల కార్యదర్శి పి.వివేకసుధ మాట్లాడుతూ ఈ అందమైన భాషను పటిష్టంగా అభివృద్ధి చేయుటకు సంవత్సరం పొడవునా సమగ్రమైన కార్యక్రమాలు, సదస్సులు, వ్యాసరచన పోటీలు వగైరా వంటివి నిర్వహించే ప్రయత్నాలు చేపట్టాలి అన్నారు.

# కార్పొరేషన్ ఋణమంజూరుకు ఇంటర్వ్యూలు

భిమునిపట్నం : వివిధ కార్పొరెషన్ల ద్వారా ఉపాధి సబ్సిడి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నవారికి భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ లు నిర్వహించారు. తాటితూరు,అన్నవరం,పెద్ద నాగమయ్య పాలెం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు రెండో రోజు కూడా కొనసాగాయి. ఎమ్పీడీవో కె.హరిప్రసాదరావు ఆద్వర్యంలో బ్యాంకు అధికారులు సంబం ధిత సిబ్బంది అభ్యర్దుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఇంటర్వ్యూ లకు సుమారు 350 మంది హాజరు అయ్యారు ఈ కార్యక్రమం లో ఎం.పి.పి యరబాల క్రిష్ణవేణి , జెడ్పిటిసి ఎస్.అప్పారావు,బి.సి.వెల్ఫేర్ అధికారులు, విస్తరణాదికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా ఉపాధి సబ్సిడి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నవారి భీమిలి జోనల్ కార్యాలయం లో రెండో రోజు కూడా ఇంటర్వ్యూ లు నిర్వహించారు. భీమిలి జోనల్ కార్యాలయం పరిధికి చెందిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు కొనసాగాయి. జోనల్ కమిషనర్ బి.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు సంబంధిత సిబ్బంది అభ్యర్దుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఇంటర్వ్యూలకు సుమారు 350 మంది హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో టి.పి.ఆర్ఓ శ్రీనివాసరావు, బి.సి.వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

## ఆకుమడులు వేయడానికి 24 గంటల ముందు

# విత్తనశుద్ధి తప్పనిసరి


విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : పొలంలో ఆకు మోడలు వేయడానికి 24 గంటల ముందు 75 గ్రా పోడి కార్బండిజమ్ తో విత్తనాలను తప్పనిసరిగా శుద్ధి చేయాలని నర్సీపట్నం వ్యవసాయ శాఖ అధికారి కె ఝాన్సీలక్ష్మి తెలిపారు. బుధవారం నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సకల రమణమ్మ నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చింతకాయల సన్యాసిపాత్రుడు చేతుల మీదగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ విత్తనాల పంపిణీ పూర్తిగా బయోమెట్రిక్ విధానం ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. విత్తనాలు బస్తా రూ.921 కాగా వాటిని 300 సబ్సిడీతో 620 ఒక్క రూపాయికి అందజేశామన్నారు. మొత్తం 70 విత్తన బస్తాలు ఒక ఎకరా ఉన్నవారికి ఒక బ్యాగు రెండు ఎకరాలు ఉన్న వారికి రెండు బ్యాగులు చొప్పున అందజేశామన్నారు. విత్తనాల బ్యాగులో నుండి విత్తనాలు నమూనాలను తీసి పరీక్ష నిమిత్తం గుంటూరు లేబరేటరీకి పంపడం జరిగిందన్నారు. ఆకుమడి లో విత్తనాలు వేసే ముందు కార్బన్ డిజైన్తో విత్తనాలు చేయడం వలన కాయ తెగులు, అగ్గి తెగులు రాకుండా నివారించవచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ ప్రసాదు రైతులు పాల్గొన్నారు.

# ఈనెల 26 నుంచి విశాఖజిల్లాలో మలివిడత జనసేన పోరాట యాత్ర

## విస్తృతంగా పర్యటించనున్న పవన్ కల్యాణ్



విశాఖపట్నం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విశాఖపట్నం జిల్లాలో జనసేన పోరాట యాత్రను ఈనెల 26 నుంచి తిరిగి ప్రారంభిస్తున్నారు. తన వెంట వుండే సిబ్బందిలోని ముస్లిం సోదరుల కోసం రంజాన్ పండుగ సందర్భంగా విశాఖజిల్లా యాత్రకు పవన్కల్యాణ్ విరామం ఇచ్చిన సంగతి విధితమే. అయితే తనను మూడు నెలలుగా బాధిస్తున్న కంటి సమస్యకు ఈ విరామ కాలంలో చిన్నపాటి శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం తిరిగి యాత్రను పవన్కల్యాణ్ ప్రారంభిద్దామనుకున్నారు. అయితే తాజాగా జరిగిన వైద్య పరీక్షలను పరిశీలించిన డాక్టర్లు శస్త్ర చికిత్సకు ఇంకొంతకాలం ఆగాలని సూచించడంతో పోరాటయాత్రను తిరిగి ప్రారంభించాలని పవన్కల్యాణ్ నిర్ణయించారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే ఈ మలివిడత యాత్ర విశాఖజిల్లాలో మూడు నుంచి నాలుగురోజుల పాటు కొనసాగుతుంది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించడంతో పాటు ఉత్తరాంధ్ర మేధావులతో పవన్కల్యాణ్ సమావేశం అయ్యే అవకాశం వుంది. విశాఖజిల్లా అనంతరం పోరాటయాత్ర తూర్పుగోదావరి జిల్లాలో ప్రారంభమవుతుంది. తూర్పు గోదావరి జిల్లాలో పోరాట యాత్ర సన్నాహాలతో ఆ జిల్లా జనసేన నేతలు నిమగ్నమైవున్నారు.

# మండలంలో ప్రవేశించిన మన్యం కోసం ముందడుగు


మండలంలో పర్యటిస్తున్న లోకులగాంధీ

కొయ్యూరు : ఏప్రిల్ 14న మండలంలో అల్లూరి కళా మందిరం నుండి ప్రారంభించిన మన్యం కోసం ముందడుగు కొయ్యూరు, చింతపల్లి, జికెవీధి, జి.మాడుగుల, పాడేరు మండలాల్లో 910 కిలో మీటర్ల పాదయాత్ర తిరిగి కొయ్యూరు మండలంలోని కొండసంత చేరుకుంది. ఈ మేరకు మండల బిజెపి పార్టీ మండలాద్యక్షులు కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బిజెపి గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు లోకులగాంధీ చేపట్టిన మన్యం కోసం ముందడుగు పాడేరు డివిజన్లో కొయ్యూరు, చింతపల్లి, జికెవీధి, జి.మాడుగుల, పాడేరు మారుమూల శివారు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ అక్కడ వారి జీవన స్థితిగతులు అడిగి ఆయా గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లు చేసిన తప్పిదాలు, అవినీతిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.

తాగునీరు కొన్ని గ్రామాలకు లేదని, విద్యుత్ సౌకర్యాలు లేవని, రహదార్లు కానరాలేదన్నారు. పోడు భూముల కోసం పట్టాలేవని, రహదార్లు లేవని, పోడు భూముల కోసం పట్టాలివ్వాలని కొన్ని గ్రామాల గిరిజనులు విన్నవించారన్నారు. జన్మభూమి కమిటీల వల్ల కొందరికే పెన్షన్, హౌసింగ్ పథకాలు ఇస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కొంత సంత రామాపురం, బంకులపాలెం, మూలపేట, మర్రిపాలెం, డౌనూరులో పాదయాత్ర సాగించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి దేపూరి రాజుబాబు, మూలపేట వైస్ సర్పంచ్ దుంపా రాజుబాబు, కూడా నాగరాజు, రీమల చంద్రరావు, గిరిజన మోర్చ మండల అధ్యక్షులు అరిమెల రాజు, కుసిరెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# దేశంలోనే తొలిసారిగా విశాఖలో హెల్త్ ఫెస్టివల్

సాయిప్రియా రిసోర్ట్స్లో ఉదయం ఈ ఫెస్టివల్ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేశ విదేశాల్లోని ప్రముఖులు, వైద్యులు, పరిశోధకులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగులు, నీతి అయోగ్ సభ్యులు, డబ్ల్యుహెచ్ఓ, యూనిసెఫ్ , ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు హాజరు కానున్నారు. ఇప్పటికే వినూత్న వైద్య సేవలను అందించడంలో ఏపీ ప్రథమంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పలు రకాల వైద్య సేవలందిస్తున్నట్లు ఇందులో భాగంగా తల్లీబిడ్డ ఎక్స్ప్రెస్, మహాప్రస్థానం. ఎన్టిఆర్ వైద్య సేవలు, వైద్య పరీక్షలు, టెలీ మెడిసిన్, టెలీ కౌన్సెలింగ్, ఎనీటైమ్ మెడిసిన్, 108 అంబులెన్స్ సర్వీసెస్, 104 ఆరోగ్య సేవలు, తదతర వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆమె వివరించారు. వినూత్న వైద్య సేవల వలన మాతృమరణాలు తగ్గాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు రేటు పెరిగిందని ఆమె అన్నారు. దీనితో సామాన్యునికి వైద్య ఖర్చులు బాగా తగ్గాయని అన్నారు. ఇటువంటి వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి అయోగ్ ప్రశంసించడమే కాకుండా నాటిని అనుసరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని అన్నారు. ఐదు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఈ హెల్త్ ఫెస్టివల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో 40 చోట్ల 40 ఇ-సబ్సెంటర్లను ప్రారంభిస్తున్నారన్నారు. టెలీ మెడిసిన్, టెలీ కౌన్సెలింగ్ తరహాలో రోగులకు మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు. ఈ కేంద్రాల్లో డ్రగ్ వెండింగ్ మెషీన్ల ద్వారా రోగులకు నిర్ణీత ఔషధాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న డయాలసిస్ కేంద్రాలను అదనంగా మరి కొన్నింటిని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు చెప్పారు. అంగన్వాడీలకు, ఇంటర్మీడియట్ చదువుకునే పిల్లలకు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు 450 మొబైల్ టీమ్ల ద్వారా ముఖ్యమంత్రి హెల్త్కార్డుల పంపిణీ ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిశు అహరణాలు తగ్గించేందుకు ఆర్ఎఫ్ఐడి టెక్నాలజీని వినియోగింతి తల్లి నుండి 50 మీటర్ల దూరం వెళ్లగానే ఒక గంట మ్రోగుతుందని తెలిపారు. దీనిద్వారా ఆసుపత్రులలో శిశు అపరహరణలు తగ్గించవచ్చునని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా విశాఖ నగరంలో మెడికల్ టూరిజమ్ ప్రాజెక్టు అమృత వేలీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య తెలిపారు.

జిల్లా కలక్టర్ ప్రవీణ్ కుమార్, ఆరోగ్య శాఖ సలహాదారులు జితేంద్ర శర్మ తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

## కృష్ణా డెల్టాకు జలసిరులు

నున్నట్లు తెలిపారు. అభివృద్ధి అడ్డుకోవడమే ప్రతిపక్షం పనిగా పెట్టుకుందని.. అభివృద్ధి ఫలాలు అందుకున్న వారు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సీఎం పిలుపునిచ్చారు. దేశంలోనే నీటి నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించిన ఇంజనీర్లు, అధికారులు, ఉద్యోగులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

## అన్నింటా అవినీతే.. రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంఎల్సి సోము వీర్రాజు మండిపడ్డారు. బుధవారం నగరంలోని ఓ హోటల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని, చంద్రబాబు 2016 వరకూ పోలవరం నిర్మాణాన్ని ఎందుకు ప్రారంభించలేదు? పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎందుకు కట్టారని ప్రశ్నించారు. విద్య నుంచీ నీరు చెట్టు వరకూ ప్రతి పథకంలో అవినీతే. ఒక్క గృహనిర్మాణ పథకంలోనే 30 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. ఏపీలో కనీ వినీ ఎరుగని అవినీతి జరుగుతోంది. దాన్ని మేము అంగీకరించనందునే ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోయారని తెలిపారు. బీజేపీ అవినీతిని సహించదని హెచ్చరించారు.

***ప్రధాని మోదీ లేకుంటే చంద్రబాబు జీరో***

రాజ్యసభలో నాటి ఎంపీ వెంకయ్యనాయుడు పోలవరం ముంపు మండలాల గురించి మాట్లాడుతుంటే సీఎం రమేష్ అడ్డుపడిన విషయాన్ని గుర్తు చేశారు. విభజన హామీల గురించి పోరాడని పార్టీలు నేడు నోటికి వచ్చిన విమర్శలు చేస్తున్నాయన్నారు. రెండు రాష్ట్రాలకి సమ న్యాయం చెయ్యమని కేవలం ప్లకార్డులు మాత్రం పట్టుకున్న తెలుగుదేశం ఎంపీలు, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాకు ఏమి కావాలో కనీసం నోరు విప్పలేదని ఎద్దేవా చేశారు. ఆంధ్రాకి ఈ మాత్రం హామీలైనా నెరవేరతాయి అంటే అది కేవలం బీజేపీ వల్ల మాత్రమే సాధ్యమైందన్నారు. పోలవరం, రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ హామీలను 2019 కంటే ముందే అమలు చేస్తామని తెలిపారు.

నిరుద్యోగులకు భృతి లేదు. తాత్కాలిక ఉద్యోగులకు జీతాల పెరుగుదల లేదు. కాంట్రాక్టు ఉద్యోగికి ఆరువేల జీతం పెరగదు. కానీ ముఖ్యమంత్రి తాగే మంచి నీటి బాటిల్కి ఆరొందల రూపాయల ఖర్చు పెడతారన్నారు.

***విమ్స్కి నిధుల్లేవు, అమరావతిలో అన్నీనూ...***

విశాఖ నగరంలో లో విమ్స్ ఆస్పత్రికి కనీసం నిధులివ్వరు కానీ అమరావతికి అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ మెడికల్ కాలేజీలూ తరలించేస్తున్నారు. డిమాండ్ల పరిష్కారానికి వచ్చిన నాయీ బ్రాహ్మణుల మీద ఆయన భాష ఏమిటి అన్నారు. పైగా ఇతని వైఖరికి తెలుగుదేశం క్యాడర్ సోషల్ మీడియాలో మద్దతులు, ఇతరులకు హెచ్చరికలు కూడా జారీచేస్తున్నారన్నారు.

హుద్హుద్తో ప్రకృతి ప్రకోపానికి బలైన విశాఖ నగరానికి సహాయంగా చేరిన ప్రతీ రూపాయి కేంద్రం విడుదల చేసిందేనన్నారు. ఇతర రాష్ట్రాల్లోని విద్యుత్ కార్మికులను వేలాదిగా విశాఖ జిల్లాకు తరలించిన కేంద్రం కేవలం మూడు రోజుల్లో విద్యుత్ను సంపూర్ణంగా అందించగలిగిందన్నారు. ఇది పూర్తిగా మోడీ ఘనతే అన్నారు.

## అంగన్వాడీలకు వరాల జల్లు

కురిపించారు. 7.500లుగా ఉన్న అంగన్వాడీ టీచర్ల వేతనాన్ని రూ.10,500లకు, అలాగే, రూ.4,500లుగా ఉన్న ఆయాల వేతనాల్ని రూ.6,000లకు పెంచుతున్నట్టు వెల్లడించారు. ఈ పెంపుతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.305 కోట్ల పైచిలుకు భారం పడుతుందని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రెండోసారి అంగన్వాడీల వేతనాలను పెంచామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. త్వరలోనే అంగన్వాడీలందరికీ స్మార్ట్ ఫోన్లు ఇవ్వబోతున్నట్టు ప్రకటించారు. ఒక్క ఆడపిల్లా చనిపోవడానికి వీల్లేదన్నారు. గర్భిణులు సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో శిశుమరణాల సంఖ్య తగ్గిందన్నారు. కేరళతో పోల్చి చూస్తే రాష్ట్రంలో పరిస్థితి మెరుగ్గా ఉందని తాను అభిప్రాయపడుతున్నానన్నారు. చిన్న పిల్లలు చనిపోకుండా ఉండాలనే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని.. ప్రభుత్వ ఆస్పత్రిల్లో డెలివరీల సంఖ్య పెరగడంతో పాటు పిల్లలకు టీకాలు వేసే విధానంలోనూ ఇంకా మెరుగుదల రావాలని సూచించారు.

# సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

విశాఖపట్నం: కాంప్రెహెన్సివ్ ఫైనాన్సు మేనేజ్మెంట్ సిస్టమ్ (సిఎఫ్ఎంఎస్) అమలు వల్ల నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడమే కాకుండా సుమారు వెయ్యికోట్లు ఆదా అయ్యే అవకాశం వుందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. విశాఖ నగరంలో రూ.10కోట్లతో నిర్మించనున్న ఖజానా, అనుబంధ శాఖల భవన సముదాయానికి రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ సిఎఫ్ఎంఎస్ విధానం అమల్లో తొలుత పలు సమస్యలు ఎదురైనప్పటికీ ప్రస్తుతం అన్ని శాఖలు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన వల్ల సుమారు రూ.16వేల కోట్లు పైబడి ఆర్థిక లోటును ప్రభుత్వం ఎదుర్కొంటున్నప్పటికీ అన్ని వర్గాల వారికి సంతృప్తి కలిగే విధంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నీటిపారుదల వనరులను అభివృద్ధి పర్చేందుకు గత నాలుగు ఏళ్లలో రూ.50వేల కోట్లు వెచ్చించామన్నారు. త్వరలోనే రెండుదఫాల మేర రైతు రుణమాఫీ సొమ్ము చెల్లిస్తామన్నారు. ప్రజలకు సుపరిపాలన అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయా లన్నీ ఒకే సముదాయంలో వుండే విధానానికి తమ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ ఎంతో కష్టతరమైనదని, అటువంటి శాఖను నిర్వహించే శక్తి, సత్తా అపర చాణుక్యులైన యనమల రామకృష్ణుడుకి మాత్రమే ఉందని అభినందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 45 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారని, ఒంటరి మహిళలకు కూడా పింఛన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రూ.10కోట్లతో మూడు అంతస్తుల్లో ఈ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్కుమార్ మాట్లా డుతూ తమ నియోజకవర్గం పరిధిలో ఈ భవన సముదాయాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ లాలం భవాని, ప్రభుత్వ విప్ పిజివిఆర్.నాయుడు, ఎన్.మోహనరావు, సుధాకర్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజయోగతో భగవంతుని దివ్యదర్శనం

### ఆధ్యాత్మిక శక్తికి యోగా ప్రక్రియ మూలం

### ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి రమ

విశాఖపట్నం : రాజయోగతో భగవంతుని దివ్యదర్శనం లభిస్తుందని, ఇదే సమయంలో ఆధ్యాత్మిక శక్తికి ఉపకరిస్తుందని ప్రజాపతి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి రమ అన్నారు. బుధవారం ఉదయం డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో రమ మాట్లాడుతూ ప్రపంచదేశాల్లో కేవలం భారతభూమి మాత్రమే యోగభూమిగా లోకప్రసిద్ధిచెందిందన్నారు. యోగమనే మాట తొలుత భారతదేశంలోనే పుట్టిందన్నారు. యోగమనగా సంబంధం, కలయిక, ప్రాప్తి, శృతి తదితర అంశాలు ఆధ్యాత్మికశక్తికి మూలమన్నారు. ప్రపంచవ్యాప్తంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. యోగమనేది మతాలకు, కులాలకు, ధర్మాలకు అతీతమైనదన్నారు. రాజయోగం ద్వారా మంచిని సాధించేందుకు, చెడు వ్యసనాలను దూరం చేసుకోవడానికి ఒక చక్కని మార్గమన్నారు.

సమావేశానికి ముఖ్యఅతిథిగా సెంచురియన్ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నాల్గవ ప్రపంచ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. యోగాతో సైన్స్ యొక్క శక్తి, ఆత్మ యొక్క భౌతిక శక్తి, శాంతి, ఆధ్యాత్మిక శక్తి సాధనకు అవకాశముందన్నారు. ప్రతీ ఒక్కరూ యోగాదినోత్సవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ రాజయోగ మెడిటేషన్ కోర్సు ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లో 9,200 కేంద్రాల్లో నేర్పించటం జరుగుతుందన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉచితంగా నేర్పిస్తున్నారన్నారు. విశాఖలో కూడా 9 కేంద్రాల్లో రాజయోగ మెడిటేషన్ నేర్చుకునే వెసులుబాటు వుందన్నారు. బ్రహ్మకుమారీస్ చేపట్టే కార్యక్రమాలకు తమవంతు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో వి.జె.ఎఫ్. కార్యదర్శి సోడిశెట్టి దుర్గారావు, ఉపాధ్యక్షుడు ఆర్. నాగరాజు పట్నాయక్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం, ఎం.వి.పి, కలెక్టరేట్, శాంతిపురం ప్రతినిధులు సత్యవతి, శివలీల, లలిత తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణులకు సీఎం క్షమాపణ చెప్పాల్సిందే

### సోము వీర్రాజు

విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇవ్వడం సాధ్యం కాదు అని సాక్షాత్తు కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ప్రకటిస్తే. . . రాజమండ్రికి చెందిన ఎం ఎల్ సి సోము వీర్రాజు 2019 లోగా వచ్చేస్తుంది అని ప్రకటిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ లో మనిషి కో మాట చెప్తుంటే ప్రజల్లో వీళ్లపై పూర్తిగా నమ్మకం పోతుంది అనే భయం కూడా లేకుండా పోయింది. మంగళవారం విశాఖ నగరం లో నిర్వహించిన విలేకరుల సమావేశం భారతీయ జనతా పార్టీ జాతీయ కమిటీ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ ప్రచార సమన్వయ కర్త, ఎంఎల్ సి సోము వీర్రాజు మాట్లాడుతూ తమకు మరో ఏడాది కాలం గడువు ఉందని ఆ లోగా విశాఖ రైల్వే జోన్ వస్తుంది అని ప్రకటించారు. అయితే ఈయన ప్రకటన చేయడానికి కేవలం 24 గంటల ముందే సాక్షాత్తు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆంధ్ర ప్రదేశ్ విభజన బిల్లు లో ఆంధ్ర కు రైల్వే జోన్ ఇవ్వమని లేదని, ఇవ్వడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించామని మాత్రమే ఉందన్నారు. దాని అర్ధం ఇవ్వమని కాదంటూ పత్రికా ముఖంగా చేసిన ప్రకటన ఆంధ్రాలో బీజేపీని మరింత పాతాళానికి తొక్కేసే విధంగా మారింది. అయితే ఒక్కరోజు అనంతరం సోము వీర్రాజు ఇదిగో రైల్వే జోన్ వచ్చేస్తుంది అని ప్రకటన చేస్తే వీళ్ళని ఏమనుకోవాలి.

కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై సైతం కేంద్రం సాధ్యం కాదు అని తేల్చినా, సోము వీర్రాజు సానుకూల ప్రకటన వస్తుంది అని చెప్పడం వెనుక బీజేపీ రెండు నాల్కల ధోరణి కనపడుతోంది. కేంద్రం లో క్యాబినెట్ మంత్రులుగా ఉన్న వారు కేంద్రం తీసుకున్న నిర్ణయాలు స్పష్టంగా ప్రకటిస్తుంటే... ఆంధ్రాలో ఉన్న ఒక సాధారణ ఎం ఎల్ సి అవి తప్పని, వాటిపై సానుకూల ప్రకటన వస్తుంది అని చెప్పడం అంటే ఎలా సాధ్య పడుతుందో తెలియదు.

అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై విరుచుకు పడ్డారు. సమస్యలను పరిష్కరించమని నాయి బ్రాహ్మణులూ సచివాలయానికి వస్తే వారిపై బెదిరింపులు, హెచ్చరికలు జారీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఇతనే అన్నారు.

తక్షణం వారికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్మాణ క్రమంలో జరిగిన అవినీతిపై బహిరంగ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు.



భారతీయ జనతా పార్టీ విశేష సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విశాఖ మీదగా విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పర్యటనకు వెళ్తున్నారు. విశాఖలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రకాష్ రెడ్డి, పృధ్వీరాజు, సుబ్బురామిరెడ్డి, నరేంద్ర ప్రకాష్, నాయుడు, నగర ప్రధాన కార్యదర్శులు అప్పలకొండ యాదవ్, రవీంద్ర రెడ్డి, కేశవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ అర్బన్ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



విశాఖపట్నం : మంగళవారం స్థానిక ఆర్ అండి బి ఆఫీసు వద్ద గల డాక్టబ్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సిద్ధవటం యానాదయ్య హాజరయ్యారు. విశాఖ నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షునిగా చల్లపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా గండ్రెడ్డి సన్యాసిరావు, కోశాధికారిగా ఆతవ సుబ్బారావు, కోశాధికారి, ఇతర సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కారక్రమంలో విశిష్ట అతిధులుగా రాష్ట్ర బిసి కులాల సమాఖ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు దువ్వారపు రామారావు నాయి బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షుడు అరిపాక పెంటారావు, తుమ్మిడి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్య వినియోగరహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎస్.డీ.ఐలో మాదక ద్రవ్య వ్యతిరేక కార్యక్రమం
- ఎస్సై పీ.అప్పారావు స్పష్టీకరణ




ఆరిలోవః స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్ఫిట్యూట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై పీ.అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాదక ద్రవ్య వినియోగము యువతలో అత్యధికంగా వుందని, సరైన పర్యవేక్షణ, క్రమ శిక్షణ, స్వీయ నియంత్రణ లేకపోవడం వల్ల ఇది అంటు వ్యాధిలా భయం కరంగా ప్రబలుతోందని, దీనిని అరికట్టడ ంలో కూడా యువతే నడుం కట్టాలని, స్వాభిలంబన గ్రూపులుగా ఏర్పడి దుష్పరిణామాలను వివరిం చాలని, మత్తు నుండి బయట పడేలా ప్రోత్సహిం చాలని కోరారు. మాదక ద్రవ్య వినియోగరహిత సమాజాన్ని నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

జూన్ 26, ప్రపంచ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేటి నుండి వారం రోజుల పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ మొదటిగా తమ ఇన్ఫిట్యూట్ నుండి ప్రారంభిస్తున్నందుకు ఇంచార్జ్ సి.వి.నరసింహ దాసు ధన్యవాదాలు తెలుపుతూ, తాము కూడా కొన్ని పోటిలు నిర్వహించి అందరిని భాగస్వాములు చేస్తామని అన్నారు. 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# విశాఖ ప్రజల మనోభావాలను దెబ్బతీయొద్దు

### రైల్వే జోన్ సాధన సమితి హెచ్చరిక




విశాఖపట్నం : నాలుగు రోజుల క్రితం విశాఖ ఎం.పి.కంభంపాటి హరిబాబు గారు రైల్వే జోన్ పై రాజకీయ నిర్ణయం తీసుకున్నారని ప్రకటించిన నేపథ్యంలో నిన్న డిల్లీ లో కేంద్ర రైల్వే మంత్రి రాష్ట్ర విభజన చట్టంలో ఏపీ కి కొత్త రైల్వే జోన్ అంశం ఇవ్వాలని లేదని పరిశీలించాలని మాత్రమే ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసి దశాబ్దాల కాలంగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కోసం చేస్తున్న ఉద్యమాన్ని అవహేళన చెయ్యడాన్ని రైల్వే జోన్ సాధన సమితి తీవ్రంగా ఖండించింది.ఈరోజు విశాఖ రైల్వే జోన్ సాధన సమితి నేతృత్వంలో విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షుడు ఎస్.ఎస్.శివశంకర్ మాట్లాడుతూ విశాఖ ప్రజల చిరకాల వాంఛను బీజేపీ ప్రభుత్వం హేళన చెయ్యడం బీజేపీ కి తగదని శీతాకాల సమావేశాల కు ముందుగానే రైల్వే జోన్ ప్రకటనచెయ్యాలని డిమాండ్ చేసారు. సిపిఐ నగర కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సాధన సమితి తో కలిసి పనిచేసిన బీజేపీ ఇటీవల జరిగిన ఎం.ఎల్.సి ఎన్నికలలో కూడా రైల్వే జోన్ తెస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ విరుద్ధ ప్రకటనలతో మోసం చేస్తున్నారని విమర్శించారు. జులై నెలలో రైల్వే జోన్ సాధనసామితి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర లో అన్ని రాజకీయ పక్షాలు ప్రజాసంఘాలు విద్యార్థి, యువజన,ప్రజాస్వామ్య వాదులు,మేధావులతో వువెత్తున ఉదయం తీవ్ర స్థాయికి తీసుకెళ్తామని ఎన్ని అవాంతరాలు ఎదురైనా పోరాడి రైల్వే జోన్ సాదించుకుంటామని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలని డిమాండ్ చేసారు ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఆర్. పి.రాజు, లక్షణరావు, అప్పారావు, జగన్,కృష్ణరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.మార్కండేయులు, నగర సహాయ కార్యదర్శి జె.డి. నాయుడు,వామనమూర్తి,ఈశ్వరావు,ఎం.ఏ.బేగం, కాంగెస్ పార్టీ నాయకులు సోడుదాసు సుధాకర్,జి.ఏ. నారాయణ రావు,ఏ.యూ. విద్యార్థి నాయకులు సమయం హేమంత్ కుమార్, సనపల తిరుపతి, లోకసత్తా నాయకుడు వి.హరిగణేష్,సిపిఐ, సిపిఎం, వై.ఎస్.ఆర్.సి.పి.కాంగ్రెస్,లోక్ సత్తా,ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఇంజనీరింగ్ విద్యార్థులకు గీతం ఫిన్‌టెక్ ఎంబిఎ కోర్సు

సాగర్‌నగర్ : ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించి ప్రముఖ ఆర్థిక సంస్థలలో ఉద్యోగం సాధించాలని ఎదురుచూస్తున్న వారిక ోసం గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో నెల కొల్పిన ఫిన్‌టెక్ అకాడమి ద్వారా ప్రత్యేక ఎంబిఎ కోర్సును నిర్వహిస్తున్నట్లు అకాడమి కో- ఆర్డినేటర్ లెబన్ జాన్సన్ తెలిపారు.

కేవలం ఇంజనీరింగ్ నేపద్యం ఉన్న వారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఫిన్‌టెక్ ఎంబిఎ కోర్సులో సీట్ల సంఖ్య పరిమితంగా ఉన్నందున ముందు వచ్చిన వారికి ముందు అనే ప్రాతిపదింకన వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశం కల్పస్తామన్నారు.

ధామ్సన్ రాయిటర్స్ వంటి ప్రముఖ సంస్థల మేధో సహకారంతో దేశంలో ప్రధమంగా నిర్వహిస్తున్న ఈ కోర్సులో ప్రవేశం పొందగోరే వారు అకాడమి కోఆర్డినేటర్‌ను 9949388844 లో సంప్రదించా ల్సిందిగా సూచించారు.

# తిరుపతి నాయుడుకు గీతం పిహెచ్‌డి అవార్డు



సాగర్‌నగర్ః ఓడరేవులలో (ప్రోర్టు) సరకుల రవాణా నిమిత్తం ఉపయోగించే బెర్తులను సురక్షిత పద్దతిలో నిర్మించడానికి అనువైన మార్గాలపై పరిశోధన జరిపినందుకుగాను సివిల్ ఇంజనీరింగ్‌లో జి.తిరుపతి నాయుడుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పిహెచ్‌డి అవార్డును ప్రకటించింది. గీతం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ బాలాజీ మార్గదర్శకంలో జి.తిరుపతి నాయుడు 'స్టడీ ఆన్ ది బిహేవియర్ ఆఫ్ బెర్తింగ్ స్ట్రక్చర్ అండర్ వేరియబుల్ స్టాక్ అండ్ క్రేన్ లోడ్స్ విత్ అండ్ వితవుట్ మూరింగ్ లోడ్ ' పేరిట పరిశోధన జరిపారు.

### గీతం ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో

# యోగ చైతన్యర్యాలీ




నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ఆధ్వర్యంలో యోగా పై వివిధ రకాల పోటీలను, వర్క్‌షాప్‌లు, ఎగ్జిబిషన్‌లను నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరక్టర్ డాక్టర్ బి.నళిని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు యోగాపై పెంచడంలో భాగంగా స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్‌లో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని ఇందులో యోగా మార్గంపై పలువురు ప్రముఖులు రచించిన గ్రంధాలతో పాటు పరిశోధన అంశాలు, వివిధ యోగా ముద్రలు వాటి ఉపయోగాలు తెలిపే చిత్ర పటాలను ఉంచుతామన్నారు. ఇదే సమయంలో 21 నుంచి జులై 5వ తేది వరకు మధుమేహ వ్యాధిపై భాదత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. యోగాసనాలు , ప్రాణాయామమ్, శుద్ధ క్రియలు, బంధాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 21వ తేదిన యోగాసనాలపై పోటీలు ఉంటాయన్నారు. నగరంలోని పాఠశాలల విద్యార్థులకు యోగా మార్గం పట్ల ఆసక్తి పెంచేలా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ నెల 21వ తేదిన గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటారని పేర్నొన్నారు.

సాగర్‌నగర్ః అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగ మార్గం ప్రాధాన్యతను తెలియజేస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ ఎస్) ఆధ్వర్యంలో బుధవారం యోగ చైతన్య ర్యాలీని నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ ముఖ్యఅతిధిగా హజరై ర్యాలీని ప్రారంభించారు. యోగా మార్గం జీవితం విలువను, శరీర క్రమశిక్షణను, సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందని ఆయిన పేర్కొన్నారు. ఏకాగ్రత, వత్తిడులను అధిగమించి చదువులో విజయం సాధించడానికి యోగ అత్యుత్తమ సాధనమన్నారు.

ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.వి.స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ప్రోగ్రాం ఆఫీసర్లు, వందల సంఖ్యలో ఎన్ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

***గీతంలో నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం :***

# 23 నుండి శ్రీ వేంకటేశ్వర స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవాలు

విశాఖపట్నం : పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వర స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవాలు ఈనెల 23వ తేదీ నుండి 29వ తేదీ వరకు శోభాయమానంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.ప్రసాద్ చెప్పారు. బుధవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం పందిరి రాట ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించామని పేర్కొన్నారు. 23వ తేదీ ఉదయం సుప్రభాతం, ఆరాధన హోమాలు, సాయంత్రం అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, విశేష హోమాలు జరుగుతాయన్నారు. 24వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు కొట్నాల ఉత్సవం, ఎదురు సన్నాహం 6.30 గంటలకు శ్రీ స్వామివారి కళ్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 25వ తేదీ సాయంత్రం స్వామివారిని గరుడు వాహనంపై తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తామని, 26న సాయంత్రం 4 గంటలకు సదస్యం, పండిత గోష్టి, 27వ తేదీ మధ్యాహ్నం 4.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ స్వామివారి తెప్పోత్సవాన్ని సముద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాతావరణాన్ని చూసుకొని తెప్పోత్సవాన్ని నిర్వహిస్తామని, ఇందుకు గాను పోర్టుట్రస్ట్ మూడు ట్రక్కులు, 20 మరపడవలు సమకూరుస్తున్నట్లు తెలియజేశారు. 28న దొంగల దోపు ఉత్సవం, 29న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న శ్రీ పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. వచ్చేనెల 7వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదానం జరుగుతుందని వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నామని ఏటా స్వామివారికి 18లక్షల రూపాయల ఆదాయం వస్తోందని తెలిపారు. స్వామివారి కళ్యాణం, తెప్పోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని కోటవీధి నుండి దేవస్థానం వరకు మూడు ఆటోలను ఉచితంగా నడుపుతున్నామని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శ్రీ స్వామివారి ఉత్సవాలను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ మైలపిల్లి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు కె.శ్రీనివాస జగన్నాథాచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

### కులాల మధ్య కుంపటి

# బీజేపీపై వ్యూహాత్మక దాడి

శ్రీకాకుళం: రాష్ట్రంలో బీజేపీపై వ్యూహాత్మక దాడి కొనసాగుతోందని ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. 2019లో ప్రధాని ఎవరో నిర్ణయిస్తామని టీడీపీ నేతలనడం అవివేకం అని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాధవ్.. టీడీపీ ప్రభుత్వంపై ప్రజలకున్న భ్రమలు తొలగిపోయాయన్నారు. చంద్రబాబు కులాల మధ్య కుంపటి పెడుతున్నారని ఆరోపించారు. విశాఖ రైల్వేజోన్ ఇచ్చేది తెచ్చేది బీజేపీనే అని మాధవ్ వ్యాఖ్యానించారు.



# విజయభాను సంపాదకీయం

## నీటి ఎద్దడికి నివారణ

నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో రాబోయే కాలంలో దేశం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోబోతున్నదని ఆందోళన వ్యక్తంచేసింది. వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్వతంత్ర వ్యక్తులతో దేశ వ్యాప్తంగా నీటి లభ్యత, కరువు పరిస్థితితో పాటు, నీటిని నిల్వ చేసుకోవటంలో అనుసరిస్తున్న పద్ధతులు, అందులో మెరుగైనస్థితిలో ఉన్న రాష్ట్రాలు ఏవనే వాటిపై కూడా నీతి ఆయోగ్ విస్తృతమైన అధ్యయనం చేయించింది. ఆ అధ్యయన నివేదికలో భీతి గొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా సుమారుగా అరువై కోట్ల మంది చాలినంత నీరు అందుబాటు లో లేక అనేకవిధాలుగా అవస్థలు పడుతున్నారని తేలింది. నీటి కాలుష్యం, చాలినంత నీరు అందుబాటులో లేకపోవటం, నీటి సంబంధిత వ్యాధులతో ఏటా సుమారుగా రెండు లక్షల మంది మరణించడం దిగ్భ్రాంతికరం. కరువు కోరల్లో చిక్కింది గ్రామీణ ప్రాంతాలు మాత్రమే కాదు, నగరాలు కూడా తీవ్రనీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. దేశంలోని 21 ప్రధాన నగరాలు కూడా వచ్చే రెండేళ్లలో తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోబోతున్నాయని నీతి ఆయోగ్ తెలిపింది. ఇందులో హైదరాబాద్ కూడా ఉండటం ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు అనుసరించిన విధానలోపమే కారణమని వేరేగా చెప్పక్కరలేదు. అయితే ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన కరువు కాటకాలకు కారణం మనిషి స్వయంకృతాపరాధమే. అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని బలిపెట్టే చర్యలకు పూనుకోవటం, అడవుల నరికివేత మూలంగా రుతుపవనాలు గతి తప్పాయి. అతివృష్టి, అనావృష్టి కరువు కాటకాలకు అర్థమే మారిపోయింది. వర్షాలు లేక కరువు ఒకసారి అయితే, వరదలతో కరువు మరోసారి మనుషులను వెంటాడుతున్నది. నగరాల పరిస్థితి మరింత దయనీయం, ప్రమాదకరంగా మారింది. ఆధునికాభివృద్ధిలో ఆకాశాన్నంటే మేడలు పెరుగుతుంటే, మరోవైపు భూగ ర్భజలాలు అడుగంటుతున్నాయి. పెద్ద భవనాలు, విశాలమైన రోడ్లతో మహానగరాలన్నీ కాంక్రీట్ వనాలై విస్తరిస్తూ ఉంటే, వాన చినుకు కురియగా నే వరద తాకిడితో వణికిపోతున్నాయి. ప్రధానంగా నగరాల విషయానికి వస్తే ఆ ప్రాంతంలో ఉన్న జలాశయాలన్నీ ఆక్రమణలకు గురికావటం, ఇబ్బ డిముబ్బడిగా భూగర్భ జలాలను బోరు పంపుల తో నీటిని తోడేస్తున్నా పట్టించుకోని స్థితి నీటి కటకటకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. కురిసిన నీటిచుక్క భూమిలోకి ఇంకే పరిస్థితే ఉండదు. అం తటా తారు రోడ్లు, కాంక్రీటు భవనాలతో నిండిపోవటంతో వర్షపు నీరంతా వరద ప్రవాహమై రోడ్లపై ప్రవహించి కాలనీలను ముంచెత్తే పరిస్థితి దాపురిస్తున్నది. నీటి కరువును తీవ్రంగా ఎదుర్కొంటున్న వాటిలో దేశ రాజధాని ఢిల్లీ, బెంగళూరు, ముంబై సహా ప్రధాన నగరాలన్నీ ఉన్నాయి. ఏటా వాన కాలం వచ్చిందంటే ముంబై నగరాన్ని వరదలు ముంచెత్తటం చూస్తూనే ఉన్నాం. బెంగళూరు, ఢిల్లీ లాంటి నగరాలు నీటికొరతతో తల్లడిల్లుతున్న స్థితి ఎప్పుడూ ఉంటున్నది. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే చైనాలో స్పాంజి సిటీ విధానంతో నగరాల నీటి ఎద్దడికి, కాలుష్యానికి చెక్ పెట్టే చర్యలను ప్రారంభించి అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. 2014లో స్పాంజ్‌సిటీ ప్రయోగాత్మక ప్రాజెక్టుగా లియాన్ యున్‌గంగ్ నగరంలో ప్రారంభించి నేడు చైనా అంతటా విస్తరించే ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే పదేండ్లలో చైనాలోని 80 శాతం నగరాలను స్పాంజ్ సిటీలుగా మార్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇవ్వాళ దేశంలో ప్రధాన నగరాలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు విరుగుడు స్పాంజ్‌సిటీ విధానమే పరిష్కారమని చెప్పక తప్పదు. నీతి ఆయోగ్ నివేదిక గ్రామీణ, పట్టణ ప్రాంత నీటి సమస్య గురించి చెప్పటమే కాకుండా, నీటి కరువు కారణంగా తలెత్తే తీవ్ర సామాజిక సమస్య ల గురించి కూడా తెలియజేసింది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశంలో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడుతుందని, ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. 2030 కల్లా నీటి వినియోగం రెండింతలు పెరిగి తీవ్రమైన నీటి కరువు ఏర్పడుతుందని అంటూ, మొత్తంగా జాతీయోత్పత్తిలో కూడా ఆరు శాతం తగ్గిపోతుందని తేటతెల్లం చేయటంద్వా రా తాగు, సాగునీటి అవసరాలు తీర్చాల్సిన అవసరాన్ని నీతి ఆయోగ్ నొక్కి చెప్పింది. సరిగ్గా ఈ నేపథ్యంలోనే నీటి ఎద్దడిని ఎదుర్కోవటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు, పథకాలు గమనార్హమైనవి. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి పథకాలతో గ్రామీణ ప్రాం త నీటి సమస్యను పరిష్కరించటమే కాదు, సాగునీటి ప్రాజెక్టులతో ఆహార పంటల ఉత్పత్తికి పెద్దపీట వేస్తున్నది. దీనికోసం వేల కోట్ల రూపాయాలు వెచ్చించి సాగునీటి ప్రాజెక్టులను నిర్మి స్తూ, వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయటానికి అనేకవిధాలుగా కృషిచేస్తున్నది.

# 24న శ్రీ సత్యనారాయణ స్వామివారి కళ్యాణం



ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన వాసుపల్లి గణేష్‌కుమార్, శిరీష, రామమూర్తి తదితరులు

విశాఖపట్నం :ఇసుకకొండపై వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామివారి దివ్య తిరుకళ్యాణోత్సవాలు ఈనెల 23 నుండి 29వ తేదీ వరకు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్మన్ విన్నకోట రామమూర్తి తెలియజేశారు. బుధవారం దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 23వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, 24వ తేదీ ఉదయం 7 గంటలకు విశేష హోమాలు, వైనతేయ ప్రతిష్ట, ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు శ్రీ స్వామివారి దివ్య తిరుకళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 25,26,27 తేదీల్లో నిత్య కార్యక్రమాలు, హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 26న సాయంత్రం 4.30 గంటలకు వైదిక సదస్యం, రాత్రి 8 గంటలకు ధూపోత్సవం, మహా కుంభాభిషేకం, 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, 29వ తేదీ సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. హుదూద్ తుఫానుకు కలశాలు, దెబ్బతిన్నందున 27వ తేదీ ఉదయం 10.36 గంటలకు పసిడి కలశ (విమాన గోపురం) ఉపాలయముల పసిడి కలశలు ధ్వజస్తంభంపై శ్రీ సుదర్శన చక్ర ప్రతిష్టలు రాజగోపుర పసిడి కలశలు, మహా కుంభాభిషేకం జరుగుతుందన్నారు. 28న కశింకోట వాస్తవ్యులు శ్రీమాన్ శ్రీ రేజేటి శ్రీరామాచార్యులచే మహా కుంభాభిషేకం జరుగుతుందన్నారు. లక్కీ షాపింగ్ మాల్ సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విన్నకోట రామమూర్తి తెలియజేశారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తలు బోరా ఈశ్వరరావు, గేదెల వెంకటరెడ్డి, అన్నం వెంకటరమణ (రమణాజీ), ఇంధన భద్రరావు, ప్రసాద్ బాబు, ఎం.రమణి, ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం నర్సింహమూర్తి పాల్గొన్నారు.

**నెలరోజుల్లో రోడ్డు పనులు పూర్తి: వాసుపల్లి**

నెలరోజుల్లో రోడ్డు పనులు పూర్తి కానున్నాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చెప్పారు. శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానాన్ని సందర్శించే భక్తులు ఇంతవరకు కేజీహెచ్ మార్చురీ మీదుగా వచ్చేవారని దీంతో ఇబ్బందులు పడేవారని, ఇకపై ఆ పరిస్థితి ఉండదని పూర్ణామార్కెట్ నుండి ఆలయం వరకు పక్కా రోడ్డును సుమారు 14కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నట్లు వివరించారు. ఆంధ్రాయూనివర్శిటీ సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం పర్యవేక్షించారు. కాంట్రాక్టర్ రాజుతో పనుల వివరాలను చర్చించారు.

# అమెరికాకు వలసలే బలం: సత్య నాదెళ్ల



కాలిఫోర్నియా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్రమ వలసలపై అనుసరిస్తోన్న కఠిన వైఖరిని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వ్యతిరేకించారు. ఇది చాలా క్రూరమైన, అసంబద్ధమైన చర్య అన్నారు. అమెరికా అగ్రదేశంగా ఎదగడానికి వలస విధానమే కారణమని ఆయన తెలిపారు. వలసల వల్ల అమెరికా అగ్రదేశంగా ఏలా ఎదిగిందో, తనలాంటి వాళ్లు ఎలా ఈ స్థాయిలో ఉన్నారో ఉదహరించారు.

ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం అనుసరిస్తోన్న కొత్తవిధానం చాలా క్రూరంగా ఉంది. దీనిలో మార్పును మైక్రోసాఫ్ట్ కోరుకుంటుంది. మనది వలస ప్రజల దేశం. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు ఇతర దేశాల్లోని నిపుణులను ఆకర్షించగల సత్తా అమెరికాకు ఉంది. ఇప్పుడు మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలను అరికట్టడానికి అమెరికా అనుసరిస్తోన్న విధానాలు నన్ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి పిల్లలను వేరు చేయడం చాలా దారుణం. నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం అమెరికా వలస విధానం ఘనతే. ఇక్కడ కాకుండా మరే దేశంలో నేను ఇంతటి పేరు పొందగలిగేవాడిని కాదు. ఈ వలసవిధానమే అమెరికాకున్న బలం. మానవహక్కులు, నైతికతను కాపాడేలా ఈ విధానాలు ఉండాలి. వాటికే మద్దతు తెలుపుతాను అని తన బ్లాగులో రాసుకొచ్చారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తోన్న ఈ విధానంతో మైక్రోసాఫ్ట్ కు ఏ సంబంధం లేదని చెప్పదలుచుకున్నాను అని మైక్రోసాఫ్ట్ విధానమెంటో వెల్లడించారు.

అక్రమ వలసలపై అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కారు అనుసరిస్తున్న కఠిన విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వలసదారుల నుంచి వారి సంతానాన్ని వేరుచేయడంపై అందరూ మండిపడుతున్నారు. మే5 నుంచి జూన్ 9 మధ్యకాలంలోనే 2,342 మంది పిల్లలను తల్లిదండ్రుల నుంచి వేరు చేశారు.

# బాబాలు తప్పుడు పనులు చేస్తే ఉరి తీయండి

కోటా: తమను తాము దేవుళ్లుగా చెప్పుకునే వాళ్లు, బాబాలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఉరి తీయాలని ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా అన్నారు. శ్రుతిమించి ప్రవర్తిస్తే వారిని జైళ్లకు పంపడం మాత్రమే కాదు, ఉరి తీసి చంపేయాలి అంటూ బాబా రాందేవ్ మీడియాకు వెల్లడించారు. కాషాయ దుస్తులు ధరించినంత మాత్రాన అందరూ ఆధ్యాత్మిక గురువులు అయిపోరని వ్యాఖ్యానించారు. ప్రతి వృత్తికి దానికి సంబంధించిన పరిమితులు ఉంటాయి. ప్రతి ఉద్యోగానికి ప్రొటోకాల్ ఉంటుంది. బాబాల విషయంలోనే అలాగే ఉంటుంది. కేవలం కాషాయ దుస్తులు ధరిస్తే బాబాలు అయిపోరు. అది వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది అని రాందేవ్ వెల్లడించారు. బాబా ధాటి మహారాజ్‌పై అత్యాచారం కేసు నమోదు అయిన నేపథ్యంలో రాందేవ్ బాబా ఈ విధంగా స్పందించారు. ధాటి మహారాజ్ రెండేళ్ల క్రితం శాని ధామ్ ఆశ్రమంలో తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదైంది. ప్రస్తుతం కేసు ఢిల్లీ క్రైం బ్రాంచికి తరలించారు. గతంలో ఆశారాం బాపు సహా పలువురు బాబాలపై అత్యాచార కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

# కవి సమయం

## యువత

కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో
దురలవాట్లకు అవకండి మీరు బానిసలు
తల్లిదండ్రులు పెట్టుకున్నారు మీ మీద ఆశలు
అప్పులు చేసి మరి చదివిస్తున్నారు చదువులు
వాళ్ళకి చెడ్డపేరు తేవద్దు మీరసలు
కావాలి మీరు అవినీతిని అరికట్టే సింహాలు
కావొద్దు మీరు ఉగ్రవాద పోషకులు
కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో

... కవితా రచన
వైదా ఈశ్వరరావు

# పంచాంగం

మాసం : నిజ జ్యేష్ట ; తిథి : అష్టమి ఉ.8.13; ఉత్తర ఉ.5.57; హస్త రా.తె.5.29; మ.వ.2.11ల 3.45

గురువారం 21-06-2018

**మేషం:** స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదు ర్కొనక తప్పదు. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారు లకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు.

**వృషభం :** రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది.

**మిధునం :**వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు అనుకూలిస్తాయి.

**కర్కాటకం :** స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే అస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు.

**సింహం :** బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది.

**కన్య :**కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపుల వల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. క్రయ విక్రయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తుల వారికి మంచి గుర్తింపు, శ్రమకు తగిన ఆదా యం లభిస్తుంది. స్త్రీలకు తమ మాటే నెగ్గా లన్న పంతం అధికంగా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి.

**తుల :** ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే అస్కారం ఉంది. నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం :** స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేష జాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు.

**ధనుస్సు :** ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు.


**మకరం :** వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. భవిష్యత్తుకు ఉపయోగపడే నూతన పరిచయాలు బాగా జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. ఫైనా న్సు, బ్యాంకుల నుంచి పెద్ద మొత్తం ధనం డ్రా చేసే విషయంలో జాగ్రత్త వహించండి. కుటుంబ సభ్యుల ఆరోగ్య నిమిత్తం ఖర్చులు పెరుగుతాయి.

**కుంభం :** ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బంది లంతగా ఉండవు. ఉపాధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కా రమవుతాయి.

**మీనం :** బ్యాంకు చెక్కులు ఇచ్చే విషయంలో పునరాలోచన మంచిది. కుటుం బీకుల మధ్య స్వల్ప విషయమే చిలికి చిలికి గాలి వానలా మారుతుంది. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి.

# సాయిబాబా చిన్న కథలు

సంకీర్తన



### కర్మాను బంధీని మనుష్య లోకే..

ఆ తల్లియొక్క దుఃఖమును ఉపశమింప జేయాలని, ఆ దొంగ "అమ్మా! ఇప్పుడు ఆ పుట్టను త్రవ్వి ఆ పామును బయటకు వచ్చేటట్లు చేసి దానిని చంపుతాను" అని లేచాడు. ఆ తల్లి బిడ్డను క్రింద పడుకోబెట్టి ఆ దొంగ చెయ్యి పట్టుకుని "నాయనా! పామును పట్టవచ్చు. కొట్టవచ్చు. నా కర్మను నేనే అనుభవించ వలసిందే" అన్నది. దానికి ఆ దొంగ "అమ్మా! ఈ విషసర్పం ఇంక ఎంతమందిని కాటువేస్తుందో! అట్టి విష సర్ప మును చంపటం ధర్మం" అన్నాడు. అప్పుడాతల్లి "నాయనా! కాలుని ఆజ్ఞ. ఈ కాలసర్పం ఈ విధంగా వచ్చి నా కుమారుని కొనిపోయింది. ఇది నా కుమారుని కర్మఫలం. 'శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు' అన్న సామెత వినలేదా? మనము అనుభవించే మేలు కీడులకు మన కర్మలే కారణం" అని అతనికి బోధించింది.

### నీవెంట రాదు


ఒక ధనవంతుడు మరణాంతరం విష్ణుదూతలతో విష్ణులోకమునకు పయనిస్తున్నాడు. ఉన్నట్లుండి అతడు విష్ణుదూతలతో "అయ్యలారా! నన్ను ఒక్కసారి మా ఇంటి దగ్గరకు తీసుకువెళ్లండి అని అర్థించాడు. వారు దయతో సమ్మతించారు. ఆ ధనికుడు తన ఇంటి ప్రాంతానికి వెళ్లి నలు దిక్కులా చూశాడు. తన స్వగృహ ప్రాంగణమును చూశాడు. పెదవి విరిచి నిట్టూరుస్తూ "దేవతలారా! ఇక పోదాము రండి" అన్నాడు. "ఏమిటయ్యా! వచ్చేటప్పుడు ఆనందంగా ఉన్నావు. ఇప్పుడు అంత నిరాశ నిస్పృహతో వున్నావు" అని అడిగారు.

ఆ ధనికుడు, "దూతలారా! నేను జీవించినంత కాలం నా భార్యా బిడ్డలకు, నా అన్నదమ్ములకు, నా బంధువర్గానికి ఎంతో ప్రేమతో సేవలు చేశాను. సహాయం అందించాను. వారికి కావలసిన ధనమును ఇచ్చాను. వారి కోర్కెలన్నీ తీర్చాను. వారిలో ఏ ఒక్కరైనా నా వెంట వస్తున్నారేమోనని చూడాలనిపించింది. మిమ్మల్ని వెనక్కు తీసుకుని రమ్మన్నాను.

వారిలో ఏ ఒక్కరైనా నా గురించి కనీసం నాలుగు మంచి మాటలైనా ఆడుకుంటారేమోనని ఆశించాను. కానీ వారెవరూ నా సంగతి అనుకోవడం లేదు. ఎవరి యింట్లో వారు, ఎవరి పనులలో వారు నిమగ్నులై ఉన్నారు. ఇన్ని దినములు వీరికి చేసిన సేవ అంతా వృథా అయినది కదా! ఆ కాలమును, భగవంతుని సేవకు ఉపయోగించినట్లైతే ఆ పుణ్యము నన్ను అంటిపెట్టుకుని వుండేది కదా! అని విచారిస్తున్నాను" అన్నాడు.

పూచిక పుల్లైనా పోయేటప్పుడు వెంటరాదు. జీవించినంత కాలం మమకారములను పెంచుకొనకుండా సంసారంలో వుంటూనే తటస్థభావం వహించాలి. తమరాకుపై నీటిబొట్టు వలె జీవితం గడపాలి.

...సశేషం



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను Minimum 7 days క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## పాడి రైతులకు
# విశాఖ డెయిరీ ఆసరా



ఏరువాక నగదు పంపిణీ దృశ్యం

గొలుగొండ : పాడి రైతులకు విశాఖ డెయిరీ ఆసరాగా ఉంటుందని డెయిరీ డైరెక్టర్ చిటికెల రాజకుమారి అన్నారు. బుధవారం గొండపాల పాలసేకరణలో కేంద్రంలో 60 మంది రైతు లకు రూ.71వేలు ఏరువాక నగదు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు ఆర్థికంగా బలోపేతానికి విశాఖ డెయిరీ కృషి చేస్తుందన్నారు. పాడి గేదెల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. పాడి పశువులకు అనారోగ్యమైతే మొబైల్ సర్వీసుతో వైద్యం అందిస్తున్నామన్నారు. ఇటువంటి పథకాల అమలు చేసి రైతులకు అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్య క్రమంలో అధ్యక్షుడు జాజుల నర్సింహమూర్తి, రూటు సూపర్‌వైజర్ గంగేష్, స్థానిక నాయకులు లోవరాజు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదానికి గురైన
# వివాహిత మృతి

దేవరాపల్లి : ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైన వివాహిత మంగళవారం విశాఖ కెజెహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్ ఐ పి .నరసింహ మూర్తి తెలిపారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు పెద్ద కోరాడ గ్రామనికి చెందిన మాదాల లక్ష్మి (25 )ఈ నెల 18 న ఉదయం ప్రమాదవశాత్తు కిరోసిన్ బుడ్డి పడి అగ్ని ప్రమాదానికి గురై 80 శాతం కాలిపోయింది. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం కుటంబ సభ్యులు కెజిహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అమె మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతిదేహాన్ని పోస్టుమార్టం చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అయన తెలిపారు.

# సేవే పరమావధిగా

భీమునిపట్నం : సేవే పరమావధిగా వుయ్ కేర్ యు సంస్థ సభ్యులందరం పని చేస్తున్నట్లు ఇ సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విశాఖ పట్నం, వాల్తేర్ కు చెందిన అప్పలరెడ్డి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిగులు భోజనాలు ఉన్నాయనే వుయ్ కేర్ సంస్థకు సమాచారం అందించారు. దాంతో సభ్యులు విశాఖ వెళ్ళి మిగులు భోజనం ను రైల్వేస్టేషన్ పుట్ ఫాత్ పై ఉన్న వారికి, మాల్ లో పని చేసిన సెక్యూరిటీకి సుమారు200మందికి విశాఖ కు చెందిన 18మంది యువకులతో అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు పంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంస్థ సభ్యులు సేవేపరమావధిగా పనిచేస్తారని చెప్పారు.

## అంగన్వాడీలకు
# వేతన పెంపుపై హర్షం

**అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అప్పలరాజు**




నర్సీపట్నం : అంగన్వాడీలకు వేతనాల పెంచుతూ ఉండవల్లిలో సాధికార మిత్రల ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల అంగన్వాడీ అసోసియేషన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్షా 4వేల కుటుంబాలు లబ్ధిపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భవానీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారం కోసమే
# రెవెన్యూ సదస్సులు
### ఆర్డీవో విశ్వేశ్వరరావు

నాతవరం : భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమని నర్సీపట్నం ఆర్డీవో విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల జాబితాలో జిరాయితీ భూములు పొరపాటున నమోదైతే ఈ సదస్సుల ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూములు కలిగిన రైతులందరూ గ్రామసదస్సులకు హాజరై వారి యొక్క సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, తహశీల్దార్ కనకారావు, ఎంపిటిసి సుబ్బలక్ష్మి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ గార్డుగా పని చేయడానికి జాబ్‌మేళా

నర్సీపట్నం : వెలుగు ఈజిఎంలో భాగంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ, గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా 21 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల గ్రామీణ పేద నిరుద్యోగ యువకులకు గ్రామీణాభివృద్ధి సంస్థ రక్ష సెక్యూరిటీ నుండి సెక్యూరిటీ గార్డుగా పని చేయడానికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపిఎం ఎన్.సత్తిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పాసై 166 ఎత్తు ఉన్న అభ్యర్థులు ఈ నెల 22న నర్సీపట్నం మండల మహిళా సమాఖ్య కార్యాలయం (వెలుగు) జాబ్‌మేళా జరుగుతుందన్నారు. కావున అర్హత గల వారందరూ ఉదయం 10 గంటలకు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్, రేషన్ కార్డు, కులధృవీకరణ పత్రం, పదో తరగతి నుండి గల ఒరిజినల్ మార్కుల లిస్టుతో హాజరు కావాలని తెలియజేశారు. మరెన్ని వివరాలకు 9573043567 నెంబరును సంప్రదించాలని కోరారు.

## నేడు, రేపు
# ట్రైకార్ ఇంటర్వ్యూలు

కొయ్యూరు : 2018-2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ట్రైకార్ రుణ అభ్యర్థులకు ఈ నెల 22, 22 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఇమ్మానుయేల్ తెలిపారు. 21న ఏపిజివిబి కేడిపేట, నాతవరం, నర్సీపట్నం ఎస్‌బిఐ, ఏఎల్‌పురం, గొలుగొండ సంబంధిత బ్యాంకుల పరిధి అభ్యర్థులకు, అలాగే 22న ఏపిజివిబి కొయ్యూరు, ఎస్‌బిఐ ఏడిబి, నర్సీపట్నం, ఇండియన్ బ్యాంకు శరభన్నపాలెం సంబంధిత బ్యాంకుల పరిధి అభ్యర్థులకు ఆయా బ్యాంకు మేనేజర్‌ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ తమ అన్ని రకాల ఒరిజినల్ ధృవ పత్రాలు విధిగా తీసుకురావాలని కోరారు.

# అనుమానస్పదంగా వ్యక్తి మృతి



భీమునిపట్నం : అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానిక గంటస్థంబం వద్ద జరిగింది. పోలీసులు కథనం ప్రకారం ఉమ్మడి మషేన్ (48) స్థానికంగా ప్లాస్టిక్ గ్లాసులు ఏరు కుంటుంటాడు. కాగా బుధవారం అటువైపు వెళ్ళిన వ్యక్తులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు తెలియ పర్చారు. దాంతో సి.ఐ బాలసూర్యారావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అయితే మషేన్ ముఖంపై గాయాలు ఉండడంతో హత్యా లేక ప్రమాదమా అని తెలియరాలేదు. అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



**ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహానికి మోక్షం కలిగింది. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చాలా కాలం నుంచి వసతి గృహం లేక చాలా ఇబ్బందులు పడుచున్నారు. ప్రభుత్వం ఇది గమనించి అయిదు లక్షల రుపాయలతో పాత బిల్డింగ్ మరమ్మత్తులు చేయించి బాలుర వసతిగృహం నకు ఇచ్చియున్నారు.**
**బుధవారం జడ్పీ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు వసతి గృహంను ప్రారంభించారు. ఈ కార్యక్రమములో ఎమ్పీటీసీ దీసరి గంగరాజు, వైసీపీ నాయకులు శెట్టి ఆనంద్ పాల్గొన్నారు.**

# కంచుగుమ్మల, కొంతలం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు




మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానేశ్వరి

రోలుగుంట : గ్రామాల్లో వివిధ ఆస్తుల జాబితాలో ఉన్న భూముల సమస్యకు ఈ రెవెన్యూ సదస్సులు పరిష్కారం చూపుతాయని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని ప్రారంభమైన కంచుగుమ్మల, కొంతలం రెవెన్యూ సదస్సులకు హాజరై మాట్లాడారు. ఏళ్ల తరబడి వివాదాల్లో ఉన్న కొన్ని భూములను ఈ సదస్సుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అభ్యంతరాలు ఉన్న రైతులు తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తుచేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. నిషిద్ధ భూములను 22/ఎలో నమోదు చేస్తారని వీటిలో 1/ఎ అసైన్డ్, 1/బి ప్రభుత్వ భూములు, 1/సి ల్యాండ్ సీలింగ్ భూములు, 1/డి దేవాదాయశాఖ భూములు 1/ఈ అసైన్డ్ ఎలివేషన్ భూములుగా గుర్తిస్తారని ఇవి రిజిస్ట్రేషన్‌కు నిషిద్ధం కానీ కొందరు రైతుల భూముల సర్వే నెంబర్లు పొజిషన్‌లు మారడం లేదా పట్టా భూములు వీటి పరిధిలోకి చేరడం వల్ల రిజిస్ట్రేషన్లు కాకపోవడం వలన ప్రజలు సమస్యలు తప్పడం లేదన్నారు.

అటువంటి సమస్యను ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. అనంతరం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను ఏఏ సమస్యలు మీద అందించారు అనే అంశాలపై పరిశీలించారు. తహశీల్దార్ అప్పలనాయుడు కంచుగుమ్మలలో రెవెన్యూ సదస్సును నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమలో గ్రామ సర్పంచ్ బండారు రాజేశ్వరి, విఆర్ఒ నాయులు పాల్గొన్నారు.

# తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

**- తమ వద్ద నిధులులేవన్న అధికారులు**
**- అభివృద్ధి పై నోరుమెదపని ప్రజాప్రతినిధులు**





దేవరాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది .మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ సమావేశానికి అంతగా ప్రాధాన్యత లేకుండా పోయింది.

మరో రెండు నెలల్లో సర్పంచు పదవి కాలం ముగుస్తున్నప్పటికీ కనీసం గ్రామాల అభివృద్ధి పై ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం శోచనీయం. మరో పక్క అభివృద్ధికి తమవద్ద నిధులు లేవని అధికారులు చూపడం విశేషం .వెరసి మండల సమావేశం చప్పగా జరిగింది .ఎంపీపీ కిలపర్తి భాస్కరావు అధ్యక్షతన జరిగి న ఈ సమావేశంలో వివిధ శాఖల వారీగా అధికారులతో సమీక్షలు జరిపారు .ఈ కార్యాక్రమంలో జడ్పీటిసీ గాలి వర లక్ష్మి ,ఎంపీడీఓ డి .చంద్రశేఖర్ ,డిప్యూటీ తహశీల్దార్ త్రినాద్, విద్యా శాఖాధికారి రవీంద్ర బాబు ,వ్యవసాయాధికారి డి.అప్పారావు, వెలుగు ఎపిఓ తిలక్, ఉపాథి హమీ పథకం ఎపిఎం తిరుపతి రావు ,మండలంలోని సర్పంచ్లు, ఎంపిటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధి బాధితురాలికి ఆర్థిక సహాయం



బాలిక తండ్రి జబ్బార్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

కంచరపాలెం : గత మూడు నెలల నుండి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ముస్లిం తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన మదీనావలి (17) బాలికకు మద్దిలపాలెం, మంగాపురం ప్రాంతానికి చెందిన తార మస్జీద్ కమిటీ సభ్యులు అండగా నిలిచారు. బాలిక పరిస్థితి కొన్ని పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన మస్జీద్ కమిటీ సభ్యులు మస్జీద్‌కు వచ్చే ముస్లిం సోదరుల వద్ద విరళాలు సేకరించారు. ఈ మేరకు బాలిక నివాసానికి వెళ్ళి ఆమెను పరామర్శించారు.

వైద్య ఖర్చుల నిమిత్తం సేకరించిన లక్ష ఆరువేల ఆరువందల రూపాయల మొత్తాన్ని బాలిక తండ్రి జబ్బార్‌కు అంద జేశారు. ఈ కార్య క్రమంలో తార మస్జీద్ కమిటీ అధ్యక్షులు ఎండీ రజాక్, షేక్ మదీనా, షేక్ మదీనాషా, యూత్ అసోషియేషన్ సభ్యులు షేక్ కాలీసా, బుజ్జి, భాషా, స్థానిక ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు సిఎం చేతుల మీదుగా సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం



భీమునిపట్నం : భీమిలిలో బుధవారం స్థానిక మామిడి పాలెం లో సుమారు 4 ఎకరాల స్థలంలో 20 కోట్ల రూపాయల పెట్టుబడితో గాన్ కో ఎనర్జీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో స్థాపించిన సోలార్ పవర్ ప్లాంటును ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గాడు అప్పలనాయుడు విలేకరుల సమావేశములో తెలిపారు. ప్రారంభోత్సవానికి విద్యుత్ శాఖా మంత్రి కిమిడి కళా వెంకటరావు, హోమ్ శాఖా మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప, పరిశ్రమల శాఖా మంత్రి అమర్నాథ్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు,మానవవనరులు శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో సోలార్ వినియోగం ఎక్కువగా ఉంటుందని దానిని దృష్టిలో పెట్టుకుని 320, 250, 150, 100, 50 వాట్స్ గల సోలార్ పానల్స్ తయారు చేస్తున్నామని, తయారు కాబడిన పానల్స్ ను ఆఫ్రికా దేశాలతో కుదిరిన ఒప్పందంపై ఎగుమతి చేస్తామని తెలిపారు. ముడిసరుకు మలేసియా, తైవాన్, చైనా దేశాల నుండి దిగుమతి చేసుకుంటామని తెలిపారు.జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, బుధవారం సోలార్ పవర్ ప్లాంట్ ను సందర్శించారు.అనంతరం ముఖ్యమంత్రి భీమిలి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రూట్ మ్యాప్ తదితర అంశాలపై పోలీసు అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులతో సంప్రదించారు. ఇందులో తహ శీల్దార్ గంగాధరరావు, మండలాభివృద్ధి అధికారి కె.హరిప్రసాద రావు, భీమిలి జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు,ఆర్ ఐ.రామక్రిష్ణ పాల్గొన్నారు.

# మైనర్ బాలికలపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి - ఐద్వా



విశాఖపట్నం : గాజువాక, హరిజన జగ్గయ్యపాలెంలో ముక్కుపచ్చలారని ఇద్దరు మైనర్ బాలికల పై అత్యాచారం చేసిన మానవ మృగం రాజారత్ పై పోక్సో, నిర్భయ చట్టాలను నమోదు చేయాలని, బాధితులు ఒక్కొక్కరికీ ఎనిమిది లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఐద్వా నగర కమిటీ డిమాండ్ చేస్తోంది. వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కి లో ఉన్న బాధిత బాలికలను, వారి కుటుంబాన్ని బుధవారం ఐద్వా నగర కార్యదర్శి ఆర్.యన్. మాధవి, ఐద్వా గాజువాక జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె. సంతోషం, కె. మంగవేణి, జోన్ నాయకులు వై. సత్యవతి, జి. మణి, కె. స్వర్ణలత, సిఐటియు నగర నాయకులు జి. సుబ్బారావు తదితరులు కలిసి వివరాలు తెలుసుకున్నారు. నిరుపేద దళిత కుటుం బానికి చెందిన 8 సంవత్సరాలు, 6 సంవత్సరాల వయసు గల ఇద్దరు బాలికలను పరిచయస్తుడైన వ్యక్తే నిర్భందించి అత్యాచారం చేయడం అత్యంత దుర్మార్గమని, చిన్న పిల్లలపై పశువుల్లా ప్రవర్తిసున్న ఇటువంటి సంఘటనలు చూస్తే మనం మనుషుల మధ్య బ్రతుకుతున్నామా? మృగాల మధ్య ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని అన్నారు. అత్యాచారాలకు పాల్పడిన వారికి ఉరిశిక్ష అమలు చేస్తే మహిళలపై అఘాయిత్యాలు తగ్గిపోతాయని చెప్పిన బీజేపీ, తమ ప్రభుత్వం ఆడపిల్లల రక్షణ కోసమే నిలుస్తుందని గొప్పలు చెప్పుకుంటూ మహిళల రక్షణ కోసం అవగాహనా ర్యాలీలుచేసి హడావిడి చేసిన తెలుగుదేశం ప్రభుత్వం, ఈ దారుణానికి ఏమి సమాధానం చెప్తారని ఐద్వా నాయకులు ప్రశ్నించారు. సంఘటన జరిగి ఐదు రోజులైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం మహిళలపట్ల వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని అన్నారు. టీడీపీ, బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో మహిళలపై ముఖ్యంగా బాలికలపై అత్యాచారాలు, వేధింపులు పెరిగా యని, మహిళల పై జరుగుతున్న నేరాలలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండవ స్థానంలో ఉందని అన్నారు. ఎంతో ప్రశాంతంగా ఉండే విశాఖ లో మహిళలపై నేరాల సంఖ్య పెరుగు తోందని, రాజకీయ నాయకులు, పోలీసులే నేరస్తుల కొమ్ము కాస్తు న్నారని, మహిళల రక్షణకోసం చట్టా లను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసారు. మద్యం, అశ్లీల సిని మాలు-సాహిత్యం నిషేధించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేసి దోషులకు త్వరితంగా శిక్షలు పడేలా చూడాలని, మీడియా మోనిటరింగ్ కమిటీలు వేయాలని డిమాండ్ చేసారు. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డ నింధితుడిపై పోక్సో చట్టం, నిర్భయా చట్టాలను నమోదు చేయాలని, బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ఎనిమిది లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, లేదంటే తాము మహిళలందరినీ కలుపుకుని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# నేటి నుండి రైస్‌మిల్లు కార్మికుల సమ్మె

యానాం: నూతనవేతన ఒప్పందం అమలు జరగకపోవడంతో యానాం రైస్‌మిల్లు కార్మికులు సమ్మెబాట పట్టారు. యానాం రైస్‌మిల్లు వర్క్‌ర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాయత్రి మోడ్రన్ రైస్ మిల్లు, తుముకా వీరేశ్వర రైస్ మిల్లులో పనిచేస్తున్న వందలాదిమంది కార్మికులు నూతనవేతన ఒప్పందం అమలుచేయాలని జనవరిలో కార్మిక శాఖకు రైస్‌మిల్లు యాజమాన్యానికి నోటీసులు జారీచేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నూతన వేతన ఒప్పందం అమలు జరుగుతుండేది అయితే ఇటీవల ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొన్ని రైస్‌మిల్లులు మూతపడటంతో మిగిలిన రెండు రైస్‌మిల్లుల యాజమాన్యాఅలు ఆర్థిక ఇబ్బందల వలన వేఎతనాలు పెంచలేమని ఈ యేడాదికి పాత విధానం కొనసాగించాలని యాజమాన్యం కోరారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నూతన వేతనం పెంచవలసిందేనని కార్మికులు చర్చల సందర్భంగా విజ్ఞప్తిచేయడం జరిగింది. ఈ చర్చలు కొలిక్కి రావకపోవడంతో యాజమాన్యం కార్మికులతో పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు క్యాంపు కార్యాలయం వద్ద చర్చలు జరిపారు. అవి కొలికి రావకపోవడంతో మరో కొంత గడువులోగా సమావేశం నిర్వహించి పరిష్కరిస్తామని మంత్రి మల్లాడి మామీ ఇచ్చారు. అయితే యాజమాన్యం పెంచేదిలేదని కరాకండిగా చెప్పడంతో కార్మికులు సమ్మెబాట పట్టాలని నిర్ణయం తీసుకున్నారు.దీంతో గురువారం నుండి రైస్ మిల్లు కార్మికులు సమ్మెచేసేందుకు సిద్ధం అవుతున్నారు. నూతన వేతనం అమలుజరిగే వరకు సమ్మె కొనసాగుతుందని ఒకవేళ మంత్రి మల్లాడి కలుగచేసుకొని పరిష్కరిస్తామంటే కొంత గడువు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కార్మికులు సమ్మె నిర్ణయాన్ని అధికారులకు, యాజమాన్యానికి తెలియజేసినట్లు యానాం రైస్ మిల్లు వర్క్‌ర్స్ యూనియన్ నాయకులు తెలిపారు.

# అనంతగిరిలో గ్రామస్థాయి లెర్నర్ లైసెన్స్ పరీక్షలు




అనంతగిరి: బుదవారం మండలంలోని కాశీ పట్నం పంచాయతీ కేంద్రంలో మీముంగిట్లో రవాణాశాఖ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో లెర్నర్ లైసెన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెహికల్ ఇనస్పెక్టర్ పొన్నాడ శివరామ గోపాల్ లెర్నింగ్ లైసెన్సు అభ్యర్థులు కు వాహన వినియోగము వాహనం నడిపినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. గిరిజన ప్రాంతంలో ఘాట్ రోడ్డులో వాహనాలు నడపాల్సి ఉంటుంది కాబట్టి వాహన నియంత్రణ ఏవిధంగా చేయాలి అనే అంశాలు వివరించారు. మేళా ప్రారంభంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో స్లాట్ బుకింగ్ లెర్నింగ్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభంఅయింది. రానున్న రోజుల్లో ప్రతీ పంచాయతీ కార్యాలయంలో రవాణాశాఖ సేవలు అందించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమములో స్థానిక సర్పంచ్ శిరగం దేముడు సియస్ సి నిర్వాహకులు పాలెపు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు

# గురుకుల సిబ్బందిపై వేటు

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి గురుకుల కళాశాల సిబ్బంది పై రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వి .రాములు వేటు వేశారు. కాంట్రాక్టు పద్దతిలో పని చేస్తున్న బోటనీ, జువాలజీ లెక్చలర్లు సి.లచ్చన్న, ఎల్. సత్యనారయణలను ఉద్యోగాల నుంచి తొలగించారు. కెమిస్ట్రీ లెక్చలర్‌గా పని చేస్తున్న పి .మాధవిని సస్పెండు చేశారు .ఇంచార్జి ప్రిన్సుపల్‌గా పని చేస్తున్న కె .వి రమణతో పాటు మేథ్స్ లేక్షర్‌గా పనిచేస్తున్న వి వి.సత్యనారయణ లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.వి. రమణను ఆ బాధ్యతల నుంచి తప్పించి అదే కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ లెక్చలర్ ఎస్ .లక్మణ రావుకు అ భాద్యతలను అప్పగిస్తూ రాష్ట్ర కార్యదర్శి తరపున జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మేరకు ఇన్‌చార్జ్ ప్రిన్సుపాల్‌గా లక్మణ రావు బుధవారం భాద్య తలు చేపట్టారు. 2017 -18 విద్యా సంవత్సరంలో జరిగిన ఇంటర్ పరీక్షలకు ఈ కళాశాల నుంచి 126 మంది హాజరు కాగా కేవలం 9 మంది మాత్రమే పాస్ అయ్యారు. ఈ కారణం గానే గురుకుల విద్యా సంస్థ చర్యలు తీసుకుంది.

# సర్వేకొలతలు కీలకం

కాకినాడ/బొమ్మూరు : భూమి, స్థలవివాదాల్లో సర్వే కొలతలు ఎంతో కాలకమైనవని న్యాయవాది ఎస్.కె.రెడ్డి పేర్కొన్నారు. బొమ్మూరులోని నాక్ సెంటర్‌లో సర్వే అకాడమీ విద్యార్థులనుద్దేశించి పలు రెవెన్యూ, సర్వే అంశాలపై న్యాయ అవగాహన కల్పిస్తూ రెడ్డి ప్రసంగించారు. మరో న్యాయవాది లక్ష్మీనాయుడు రికార్డులు, కోర్టు విధులు, సర్వేయర్లపాత్ర వివరించారు. సర్వే ఫ్యాకల్టీ నమశ్శివాయ మాట్లాడుతూ సర్వేయర్లకు విధి నిర్వాహణతోపాటు భూ చట్టాలపట్ల అవగాహన అవసరమన్నారు. ఇన్‌స్పెక్టర్లు (సర్వే) రంగప్రసాద్, దుర్గారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులో తప్పులు... న్యాయ చిక్కులకు మూలాలు

## - సర్వే అకాడమీ న్యాయవిజ్ఞాన సదస్సులో మెజిస్ట్రేట్ శ్రీహరి



కాకినాడ/సామర్లకోట: భూమి కొలతలను సక్రమంగా వేసి హద్దులు నిర్ణయించే గురుతర బాధ్యత సర్వేయర్లపైనే ఉందని, అటువంటి కొలతలు, హద్దులలో తప్పులు దొర్లితే న్యాయచిక్కులు ఏర్పడతాయని కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కంటిపూడి శ్రీహరి పేర్కొన్నారు. సామర్లకోటలోని ప్రాంతీయ సర్వే అకాడమీలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో భూ-రికార్డుల భద్రత, భూమి చట్టాలపై సర్వేయర్లకు అవగాహన కలిగించారు. రెవెన్యూ రికార్డుల్లో భూ కొలతలు, హద్దులు ఎంతో కీలక పాత్ర పోషిస్థాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. సరైన పద్దతిలో, పూర్తి అవగాహనతొ కొలతల ధృవీకరణ చెయ్యవలసిన బాధ్యత సర్వేయర్లపైనే ఉందన్నారు. కోర్టుల్లో పేరుకుపోయే పలు స్థల వివాదాల సమస్యలకు మూలం కొలతల ధృవీకరణలో తప్పులు దొర్లడమేనన్నారు. సరైన పద్దతిలో కొలతలు చేయగలిగితే న్యాయ వివాదాలు తొలగుతాయని అన్నారు. న్యాయవాది ఎస్.కె.రెడ్డి, లక్ష్మీనాయుడు, సర్వేప్యాకల్టీ నమశ్శివాయ, నిర్వాహకుడు, సర్వే ఇన్‌స్పెక్టర్, త్రివిక్రమరావు, సామర్లకోట పోలీసు స్టేషన్ ఎఎస్‌ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతిలేని ట్రాక్టర్లపై కేసులు

యానాం: పుదుచ్చేరి రోడ్డు మరియు ట్రాన్స్‌పోర్టు అనుమతులు లేకుండా తిరుగుతున్న నాల్గు ట్రాక్టర్లపై కేసు నమోదుచేసినట్లు యానాం సిఐ గిడ్ల సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఉదయం కురసంపేట జంక్షన్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాల్గు ట్రాక్టర్లను స్వాధీనంచేసుకొని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా యానాంలో నడిపితే అటువంటి వాహనాలపై కేసులు నమోదుచేస్తామని రోడ్డు మరియు రవాణా శాఖ నుండి సిపిలు చెల్లించి నడుపుకోవాలన్నారు. ఈ దాడులలో ఎస్‌ఐ కట్టా సుబ్బరాజు, కానిస్టేబుల్‌లు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి 22లోగా దరఖాస్తు చేసుకోవాలి

యానాం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సోలన్ తెలిపారు. ఈ నెల 22న 5 గంటలలోపు వివిధ కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకోవాలన్నారు. మిగిలిన వివరాలకు ఆఫీసు వేళలలో సంప్రదించాలన్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలకు యానాంకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడియేషన్ (ఎన్‌బిఎ) న్యూఢిల్లీవారు ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్రాంచికి మూడు సంవత్సరాల గుర్తింపు ఇచ్చారన్నారు. 2018-19 సంవత్సరం నుండి 2020-21 సంవత్సరం వరకు వర్తిస్తాయన్నారు.

# తేనెటీగల దాడిలో వీఆర్వో, హెల్త్ ఎడ్యుకేటర్‌కు గాయాలు

కొత్తపల్లి: తేనెటీగల దాడిలో వీఆర్వో, హెల్త్ ఎడ్యుకేటర్ తీవ్రగాయాలైన సంఘటన బుధవారం కలవలదొడ్డి - కొత్తపల్లి రహదారిలో చోటుచేసుకొంది. బాధితుల కథనం ప్రకారం నాగులాపల్లి వీఆర్వో చంద్రరరావు, కొత్తపల్లి పిహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారావులు బుధవారం కొత్తపల్లికి విధులు నిర్వర్తించేందుకు మోటారు సైకిళ్లపై వస్తున్నారు. వీరికి ముందు ధాన్యంలోడుతో లారీ కొత్తపల్లికి బయలుదేరింది. లారీ కలవలదొడ్డి దాటే సమయంలో చెట్టుకొమ్మకు తగిలింది. దీంతో ఆ కొమ్మకు ఉన్న తేనెటీగలు ఒకసారిగా చెదిరిపోయి లారీ వెనుకవస్తున్న వీరిపై దాడిచేసి గాయపరిచాయి. వీరిద్దరినీ వెంటనే కొత్తపల్లి పిహెచ్‌సీ తరలించారు. వీఆర్వో, హెల్త్ ఎడ్యుకేటర్‌కు తేనెటీగల ముల్లులను వైద్యాధికారిణి లక్ష్మీ తొలగించారు. అనంతరం చికిత్స అందించారు. వీరిని పలువురు పరామర్శించారు.

# నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడ గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరులు రూ.1,00,000/ విరాళమును ఏసి ఈరంకి. జగన్నాధరావుకు అందజేశారు.దీనిపై వచ్చు వడ్డీతో ప్రతీ సంవత్సరం ఆగస్టు 16వ తేదీన వెంకటేశ్వర్లు, వెంకటనర్సమ్మ పేరున అన్నదానం జరిపించవలెని కోరారు.

# రూ. 75 లక్షలతో నిర్మించే ఎస్.టి.ఓ. కార్యాలయానికి శంకుస్థాపన



ఆలమూరు : మండల కేంద్రం ఆలమూరులో తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో రూ. 75 లక్షలతో నిర్మించనున్న సబ్ ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణానికి బుధవారం శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం శంకుస్థాపన చేసారు. అలాగే మార్కెట్ సమీపంలో బొబ్బా చిన వీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రూ. 7 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ సముదాయాన్ని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, డి.సి.ఎమ్.ఎస్. ఛైర్మన్ కె.వి. సత్యనారాయణ రెడ్డిలు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎ.ఎమ్.సి. ఛైర్మన్ ఈదల సత్యనారాయణ చౌదరి (నల్లబాబు), ఎం.పి.పి. కొత్తపల్లి ధనలక్ష్మి, జెడ్.పి.టి.సి. దండంగి మమత, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొత్తూరి వీరన్ననాయుడు, సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, మండల టిడిపి అధ్యక్షులు సిద్దిరెడ్డి పెద్దకాపు, మాజీ జెడ్.పి.టి.సి. రామానుజుల శేషగిరిరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పోరేషన్ ఋణాల లబ్దిదారుల ఎంపిక



ఆలమూరు : ఆలమూరు మండల పరిధి మడికి, చెముడు లంక గ్రామాలలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాల్లో వివిధ కార్పోరేషన్ ఋణాలకోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా బ్యాంక్ మేనేజర్లు, ఎంపిడిఓ ఎమ్.వి.రమణారావు, ఈఓపిఆర్‌డి పి.బొజ్జిరాజు, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ జి.భాగ్యలక్ష్మి సెలక్షన్ కమిటీ సభ్యులు రాయుడు సూరిబాబు, మడికి, చెముడులంక, బి.వి.లంక గ్రామాలకు చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# లెఫ్ట్‌నెంట్ గవర్నర్ ఏకపక్ష విధానాలకు అధికారులు వంతపాడరాదు

## - వి. నారాయణసామి



పుదుచ్చేరి : పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణసామి మంత్రివర్గ సభ్యులతోను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కారదర్శులు, డైరెక్టర్లు, అండర్ సెక్రటరీలతో బుధవారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమాంతర పాలన సాగిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి ఏకపక్ష విధానాలకు అధికారులు వంతపాడరాదని సిఎం స్పష్టం చేశారు. రాజ్యాంగంలో సూచించిన విధంగా 16 రకాల అంశాలు మినహా మిగిలిన వాటి గురించి లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి తీసుకోవల్సిన పనిలేదని స్పష్టంచేశారు. మంత్రివర్గంతో ప్రమేయం లేకుండా లెఫ్టినెంట్ గవర్నర్ జారీచేసే అదేశాల్ని ఎట్టి పరిస్థితిలోను అధికారులు అమలుచేయరాదని సిఎం స్టాండింగ్ ఆర్డర్స్ జారీచేశారు. సక్రమంగా జీతలు అందుకుంటున్న అధికారులు జీతాలు లేకుండా నెలల తరబడి పనిచేస్తున్న క్రింది ఉద్యోగుల కష్టాలు ఎలా అర్థం అవుతాయని వారినుండి మంచి పనిని ఎలా ఆశించగలమని మల్లాడి ప్రశ్నించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 20 శాతం మంది తమ రేషన్ కార్డులను తాకట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని దీనికి లెఫ్టినెంట్ గవర్నర్ వైఖరి కారణమని వివరించారు. గవర్నర్ ఇచ్చే ఉత్తర్వులు కొన్నియితే, అధికార్లు మరికొన్ని ఆంక్షలు జోడించి పథకాల అమలును అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి వారి కష్టాల్ని సానుభూతితో అర్థం చేసుకొని వ్యవహరించాలని మల్లాడి సూచించారు. సమావేశంలో 35 నిముషాలపాటు మంత్రి పలు అంశాలపై కూలంకుషంగా చర్చించారు.

# కలవలదొడ్డిలో మూడు గడ్డివాముల దగ్ధం

కొత్తపల్లి: అకస్మాత్తుగా సంభవించిన అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమై సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లింది. కుతుకుడుమిల్లి శివరు కలవలదొడ్డిలో రైతులు దాళ్వా వరిచేలకు చెందిన మూడు ఎకరాల్లో గడ్డిని జాగ్రత్త చేసుకున్నారు.

ఎండలు ఎక్కువ కావడంతో బుధవారం అకస్మాత్తుగా గడ్డి వాముల నుంచి పొగలు మంటలు రావడాన్ని ప్రజలు గమనించారు. క్షణాల్లో మంటలు వ్యాప్తిచెందడంతో పక్కనే ఉన్న మూడు గడ్డిమేట్లుకు మంటలు వ్యాప్తిచెందాయి. కొత్తపల్లి పిహెచ్ హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారావు పిఠాపురం అగ్నిమాపక అధికారులకు సమాచా రం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది హుటా హుటిన కలవలదొడ్డి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పక్కనే ఉన్న మరో రెండు గడ్డివాములకు ప్రమాదం తప్పింది. సకాలంలో సమాచారం అందించిన హెల్త్ ఎడ్యుకేటర్‌కు, సకాలంలో చేరుకొని మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు కృజ్ఞతలు తెలియజేశారు.

# రెవిన్యూ గ్రామసభలు సద్వినియోగ పరుచుకోవాలి

## ఆర్.డి.వో రఘుబాబు

కాకినాడ: రెవిన్యూ గ్రామ సభలలో భాగముగా కాకినాడ పట్టణము నందు ఈ రోజు ఉదయము స్థానిక వార్పురోడ్డు నందు గల పిండాల సత్రము వద్ద గల ప్రగోడ స్కూల్ నందు గ్రామ రెవిన్యూ సభ ఏర్పాటు చేయడమైనది. సదరు సభకు ముఖ్య అతిథిగా కాకినాడ ఆర్.డి.వో ఎల్.రఘుబాబు హాజరైన్నారు. సభకు హాజరైన మేడలైన్ రైతులను ఉద్దేశించి ఆర్.డి.వో మాట్లాడుచూ ఈ యొక్క రెవిన్యూ గ్రామ సభలు ఈ నెల 20.06.2018 నుండి వచ్చే నెల జూలై 5 వ తేదీ వరకు జరుగునని ప్రత్యేక రెవిన్యూ గ్రామ సభలు ద్వారా రెవిన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొనబడునని సదరు సభలో ఆర్.డి.వో ఎల్.రఘుబాబు మాట్లాడుతూ ముఖ్యముగా రెవిన్యూ అంశములు అయిన సెక్షన్ 22ా రిజిష్టరు (నిషేదిత ఆస్తులు జాబితా) పై వచ్చు దరఖాస్తులు, భూమి క్రయ విక్రయములకు సమబంధించిన దరఖాస్తులు, చుక్కల భూమిలపై వచ్చు దరఖాస్తులు, అటవీ భూములు, పట్టణ భూ క్రమబద్ధీకరణ మరియు ఇండ్ల స్థలములు అదేవిధముగా కౌలు రైతు యొక్క సంయుక్త బృందాల ఏర్పాటుకు సంబంధించి ఈ యొక్క గ్రామ సభలు నిర్వహించబడుచున్నవని ఈ యొక్క గ్రామ సభల ద్వారా సంబంధిత సమస్యల పరిష్కారానికి సదరు రెవిన్యూ గ్రామ సభలు సద్వినియోగము చేసుకోవాలని తెలిపియున్నారు. సదరు గ్రామ సభలో పట్టాదారు పాసుపుస్తకములు దరఖాస్తు చేసుకొన్న రైతులకు ఆర్.డి.వో చేతుల మీదగా ఈ పాసుపుస్తకములు అందజేయడమైనది. ఈ గ్రామ సభలో ఆర్.డి.వో తోపాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ రమేష్ బాబు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జి.వరహాలయ్య, డిప్యూటి తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాస రావు, రెవిన్యూ ఇన్సెక్టర్ రవితేజ, గ్రామ రెవిన్యూ అధికార్లు కాయల సత్యనారాయణ, కొవ్వూరి శ్రీను, పుల్లా శ్రీను తదితరులు పాల్గొన్ననారు.

# గుమ్మిలేరు, సంధిపూడిలలో రెవిన్యూ సదస్సులు

ఆలమూరు : ఆలమూరు మండలం గుమ్మిలేరు, సంధిపూడి గ్రామాలలో బుధవారం గ్రామ రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. గుమ్మిలేరులో ఆ గ్రామ సర్పంచ్ కుడిపూడి మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో తహశీల్దార్ కె.పద్మావతి పాల్గొని పలు భూసమస్యలపై రైతులు అందజేసిన దరఖాస్తును స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయరు కె.అప్పారావు, విఆర్వో ఎమ్. అరుణకుమారి, రైతులు పాల్గొన్నారు. అలాగే సంధిపూడిలో ఆ గ్రామ సర్పంచ్ ఎలుగుబంటి నాగమణి బుజ్జి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ పి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, ఆర్.ఐ. ఎమ్. జానకిరాఘవలు పాల్గొని పలు భూ సమస్యలపై రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయరు కె. అప్పారావు, దేవస్థాన ఈఓ ఎ.బి.కె. రామలింగం (భాస్కర్), విఆర్వో టి.అబ్బులు, రైతులు, వి.ఆర్.ఏ.లు పాల్గొన్నారు.



గ్రేటర్ విశాఖ 15వ వార్డు నెహ్రూబజార్‌ను దక్షిణనియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సందర్శించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 15 వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యన్నారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారి విలువ వంద కోట్లేనా...?

## టీటీడీ పాలకమండలిపై రమణదీక్షితులు ధ్వజం



హైదరాబాద్ : గత కొంతకాలంగా టీటీడీ పాలకమండలిపై తీవ్ర ఆరోపణలు చేస్తున్న ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు మరోసారి పాలకమండలిపై ధ్వజం మెత్తారు. తన ఆరోపణలకు సమాధానం చెప్పలేకనే టీటీడీ పాలకమండలి తనపై పరువు నష్టం దావా వేసిందని మండిపడ్డారు. తాను చెప్పినవన్నీ వాస్తవాలేనని, వాటి గురించి సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు.

ఈ సందర్భంగా బుధవారమిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'స్వామి వారి పూజలు, నైవేద్యాల్లో లోపాలు జరుగుతున్నాయి. స్వామి వారికి ఆరాధనలు సరిగా జరగడం లేదన్నందుకు నా మీద 100 కోట్ల రూపాయల పరువు నష్టం వేసారు. అంటే స్వామి వారి పరువును కేవలం వంద కోట్లకే పరిమితం చేస్తున్నారా' అంటూ ప్రశ్నించారు.

**ఆభరణాలు తరలిపోతున్నాయి...**

శ్రీవారికి ఎందరో రాజులు విలువైన ఆభరణాలు సమర్పించారు. వాటి వివరాలను శిలాశాసనాలలో కూడా? పొందుపరిచారు. కానీ నేడు అవన్నీ తరలిపోతున్నాయి. వంటశాల నుంచి నేలమాళిగకు దారి ఉన్నట్లు తెలుస్తుంది. స్వామి వారి సంపద అంతా నేలమాళిగలోనే ఉందని, అక్కడకు సామాన్యులు వెళ్లలేరని తెలిపారు.

**స్వామి వారిని పస్తులు ఉంచారు...**

ఎవరికి చెప్పకుండా పోటును మూసివేసారు. పోటు మూసి వేస్తే ప్రసాదాలు, నైవేద్యాలు ఎక్కడ తయారు చేస్తారని ప్రశ్నించారు. అందుకే స్వామి వారిని 25 రోజుల పాటు పస్తులు ఉంచారని విమర్శించారు. పోటును మూసివేసి అక్కడ భారీగా తవ్వకాలు జరిపారని...పోటు తలుపులు తీసిన తరువాత చూస్తే అక్కడ భూకంపం వచ్చినట్లుగా ఉందన్నారు. తాను వెంటనే ఈ విషయం గురించి జేఈఈని అడిగానని..కానీ ఆయన సరిగా స్పందించలేదన్నారు. ఎవరో మేడం చెప్పిందని తవ్వకాలు జరిపామన్నారు. కానీ తరువాత కాలంలో స్వయంగా జేఈఈనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే పోటులో తవ్వకాలు జరిపామని తెలిపారన్నారు.

వీటన్నింటి గురించి ప్రశ్నిస్తే తనను ఉద్యోగం నుంచి తొలగించారని మండిపడ్డారు. తాను వద్దని వారించిన వినకుండా అతిక్రూరంగా ఆనాడు వెయ్యికాళ్ల మండపాన్ని తొలగించారని మండిపడ్డారు. ఈ తొలగింపుల్లో నాలుగైదు నిధులు దొరికాయని బయట ప్రచారం జరుగుతుందని తెలిపారు. మిరాశీ, వంశ పారంపర్య అర్చకత్వం రెండూ వేరు. కానీ ద్వేషపూరితంగా మిరాశీ వ్యవస్థను రద్దు చేయడమే కాక వంశపారంపర్య అర్చకత్వాన్ని కూడా రద్దు చేశారని విమర్శించారు. కానీ దీనిపై తాము సుప్రీం కోర్టుకు వెళ్లి న్యాయం సాధించమని గుర్తు చేసారు.

**సీబీఐ విచారణ జరపాలి...**

గతంలో ఆభరణాల్లో ఏమైనా తరుగులు ఉంటే అర్చకుల నుంచి డబ్బులు వసూలు చేసే వారని... అందుకే అర్చకులు ఆభరణాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవారని గుర్తు చేసారు. కానీ నేడు శ్రీవారి ఆభరణాల బాధ్యత సరిగా నిర్వర్తించడం లేదని.. తరుగులు, రాలిపోయిన రాళ్లకు బాధ్యత లేకుండా పోయిందని వాపోయారు. తాను చేసిన ఆరోపణలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు.

**ఆలయంలో అపవిత్ర కార్యక్రమాలు...**

2017లో శ్రీవారి ఆలయంలో రెండు అపవిత్ర కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఇలా స్వామి వారికి అపవిత్రత ఆపాదించే కార్యక్రమాలు ఆలయంలో నిర్వహించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వైదిక విజ్ఞానం లేని అధికారులను నియమిస్తున్నారని అందువల్లే మన ఆచార, వ్యవహారాలు వారికి తెలియడంలేదని ఆరోపించారు. అధికారులు శుచి, శుభ్రత పాటించడం లేదని మండిపడ్డారు. తాను ఉన్నంత వరకూ శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడనని, కానీ ఇప్పటికి శ్రీవారి ఆలయంలో అర్చకులకు విలువ లేదని బాధపడ్డారు.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు అస్వస్థత

ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అస్వస్థతకు గురయ్యారు. ఐఏఎస్‌ల సమ్మెకు నిరసనగా లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ నివాసమైన రాజ్‌నివాస్‌లో తొమ్మిది రోజుల పాటు ధర్నా చేపట్టిన కేజ్రీవాల్ నిన్న రాత్రి ధర్నా విరమించిన సంగతి తెలిసిందే. మంగళవారం రాత్రి మంత్రులు నిర్వహించే సమావేశాలకు ఐఏఎస్‌లు హాజరుకావడంతో కేజ్రీవాల్ ధర్నా విరమించుకున్నారు. ఆయన అస్వస్థతకు గురైన కారణంగా ఈరోజు జరగాల్సిన సమావేశాలన్నీ రద్దు చేశారు. ప్రణాళిక ప్రకారం కేజ్రీవాల్ ఈరోజు ఐఏఎస్ అధికారులతో సమావేశం కావాల్సి ఉంది.

తొమ్మిది రోజులు పాటు రాజ్ నివాస్ వెయిటింగ్ గదిలో కూర్చొని ధర్నా చేయడం వల్ల కేజ్రీవాల్ ఉదయం, సాయంత్రం నడక మానేశారని, వేళకు భోజనం చేయలేదని, దీని వల్ల ఆయన చక్కెర స్థాయిలు పెరిగాయని ఆయన సన్నిహితులు వెల్లడించారు. 49ఏళ్ల కేజ్రీవాల్ డయాబెటిక్ పేషెంట్. ఆయన కచ్చితంగా రోజుకు రెండు సార్లు నడుస్తారని, పద్ధతి ప్రకారం ఆహార నియమాలు పాటిస్తారని, ధర్నా వల్లే ఆయన ఆరోగ్యం చెడిపోయిందని చెప్పారు. కేజ్రీవాల్‌తో పాటు ధర్నాలో మంత్రులు సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా, గోపాల్ రాయ్‌లు పాల్గొన్న సంగతి తెలిసిందే.




# కపాలభాతితో కాంతివంతమైన ఆరోగ్యం

**కపాలభాతి ప్రాణాయామం ఆడవారికి అనేక సమస్యల నుండి బయట పడటానికి చాలా సహాయపడుతుంది. ఒక నిర్దిష్ట సమయంలో అనేక భంగిమలను సాధన చేయవచ్చు. కపాలభాతి అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. కపాల అంటే మస్తిష్కం అని,భాతి అంటే కాంతి లేదా మెరుపు అని అర్థం. ఈ భంగిమను అనుసరించటం ద్వారా చర్మంలో మెరుపు మరియు తాజాదనాన్ని గమనించవచ్చు.ఈ మార్పు అనేది ఒక్క రాత్రిలో రాదు. దీనిని సాధించటానికి చాలా కష్టపడాలి. యోగా వ్యాయామాలు శ్వాస నియంత్రణ మరియు సంతులనం నిర్వహణలో సహాయపడి శరీర అభివృద్ధిలో ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ప్రాణాయామం శ్వాసతో సంబంధం కలిగి ఆరోగ్యకరమైన శరీరం,మనస్సు,ఆత్మలను అందిస్తుంది. ఈ శక్తివంతమైన భంగిమ ప్రాధమికంగా చైతన్యాన్ని నింపటంలో సహాయపడి,వ్యవస్థకు ఒక టానిక్ వలే పనిచేస్తుంది. అందువల్ల ఈ ప్రాణాయామం వల్ల కపాలం శ్వాసలో మెరుస్తూ మంచి శ్వాస తీసుకుంటుంది. నిర్దిష్ట సమయంలో కపాలభాతి వ్యాయామాన్ని సాధన చేయటం ద్వారా కాపాలానికి మంచి శ్వాసను అందించవచ్చు.**



కపాలభాతి టెక్నిక్ నిర్వహించటానికి దశలు:

1. ఈ భంగిమను ప్రారంభిం చటానికి మీరు ఒక సౌకర్యవంతమైన స్థానంలో కూర్చోవాలి. అలాగే వెన్నెముకను నిటారుగా ఉంచి, ఉదరాన్ని సాధ్యమైనంత వరకు సౌకర్యవంతంగా ఉంచాలి.
2. మోకాళ్ళపై చేతులను ఉంచాలి. మోకాళ్ళ మీద అరచేతులను ఉంచాలి.
3. పొట్ట కింద బాగంలో దృష్టి పెట్టాలి. మంచి పరిపూర్ణత సాధించడానికి అరచేతులను మోకాళ్ళ మీద నుంచి పొట్ట కింద బాగంలో పెట్టి, ధ్యానం చేయాలి.
4. ఇప్పుడు ముక్కు రెండు రంధ్రాల ద్వారా లోతైన శ్వాసను తీసుకోవాలి.
5. ఇప్పుడు అరచేతులతో పొట్టను శాంతంగా నొక్కి శ్వాసను నియంత్రించాలి.
6. గాలిని పీల్చటం ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. అందువల్ల గాలిని వదిలే క్రమం మీద దృష్టిని కేంద్రీకరించాలి.
7. మొదట 60 నుంచి 70 శ్వాసలతో ప్రారంభించాలి. ఆ తర్వాత 95 నుంచి 105 వరకు నిదానంగా పెంచుకుతూ వెళ్ళాలి. ఊపిరి అడ నట్టు అన్పిస్తే, ఆపి సాధారణ శ్వాస తీసుకోని మరల ప్రారంభించ వచ్చు.
8. ఈ ఆసనం వేసేటప్పుడు నోరు,ముక్కు రెండు అవయ వాలు పనిచే స్తాయి. ముక్కు గాలి పీల్చుకోవటానికి మరియు నోరు గాలిని వదల టానికి సహాయపడుతుంది. ప్రతి రోజు 15 నుంచి 20 నిమిషాల పాటు చేస్తే మంచి పలితం కనపడుతుంది.

ఈ ఆసనం వలన కలిగే ఇతర ప్రయోజనాలు: సైనస్ ,ఊపిరితిత్తులు మరియు శ్వాస వ్యవస్థను శుభ్రం చేయడానికి సహాయపడుతుంది. అలెర్జీలకు వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమైన శక్తిని ఇస్తుంది. ఉదర కండరాలు మరియు డయాఫ్రాగమ్ కు శక్తినిస్తుంది. ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును క్రమపరుస్తుంది.

***జాగ్రత్తలు:***

గుండె సమస్యలు,ఉబ్బసం, అధిక రక్తపోటు, హెర్నియా ఉన్నవారు మరియు గర్భిణీలు ఈ ఆసనానికి దూరంగా ఉండటం మంచిది. ఈ భం గిమ ఆరోగ్యకరమైన జన నేంద్రియ వ్యవస్థకు అద్భు తంగా పనిచేస్తుంది. పున రుత్పత్తి కోసం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ భంగిమలను పుస్త కాల్లో చదివి లేదా ఫోటోలను చూసి చేయకూడదు. గురువు దగ్గర నేర్చుకొని మాత్రమే చేయాలి.

# అరవింద్ సుబ్రమణియన్ రాజీనామా

## కుటుంబ అవసరాల కోసం తిరిగి అమెరికాకు



ఢిల్లీ: ఆర్థిక శాఖ ముఖ్య సలహాదారు పదవికి అరవింద్ సుబ్రమణియన్ రాజీనామా చేశారు. కుటుంబ కారణాలతో తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు ఆయన తెలిపారు. సుబ్రమణియన్ రాజీనామా విషయాన్ని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం అరవింద్ సుబ్రమణియన్ నాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుటుంబ అవసరాల కోసం తాను తిరిగి అమెరికా వెళ్లాలనుకుంటున్నానని చెప్పారు. అది ఆయన వ్యక్తిగతం కావొచ్చు, కానీ ఆయనకు చాలా ముఖ్యమైన విషయం. తన రాజీనామా విషయాన్ని అంగీకరించడం తప్ప నాకు మరో అవకాశం ఇవ్వలేదు అని జైట్లీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థకు ఆయన అందించిన సేవలకు గాను జైట్లీ ధన్యవాదాలు తెలిపారు. స్థూల ఆర్థిక నిర్వహణలో అందించిన సేవలను కొనియాడారు. తాను వ్యక్తిగతంగా సుబ్రమణియన్ డైనమిజం, శక్తి, మేధోసంపత్తి, ఆలోచనలను కోల్పోతున్నానని జైట్లీ వెల్లడించారు. 59ఏళ్ల సుబ్రమణియన్ 2014లో మూడేళ్ల పదవీ కాలానికి గాను ఆర్థికశాఖ ముఖ్య సలహాదారుగా నియమితులయ్యారు. తర్వాత ఆయన పదవీకాలం పొడిగించారు. ఈ ఏడాది అక్టోబరుతో ఆయన పదవీకాలం ముగుస్తుండగా ముందుగానే రాజీనామా చేశారు. సుబ్రమణియన్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుంచి గ్రాడ్యుయేషన్, ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబీఏ పట్టాలు పొందారు.

# అమెరికాలో ఆశ్రయానికి 7వేల భారతీయులు దరఖాస్తు

ఐక్య రాజ్య సమితి: గత ఏడాది అమెరికాలో ఆశ్రయం కోసం ఏడు వేల మందికి పైగా భారతీయులు దరఖాస్తులు చేసుకున్నారని ఐక్యరాజ్య సమితి ఓ నివేదికలో వెల్లడించించింది. ఐరాస శరణార్థుల ఏజెన్సీ వెల్లడించిన వివరాల ప్రకారం.. శరణార్థులు ఎక్కువగా అమెరికాలో ఆశ్రయం కోసమే దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 2017 చివరి నాటికి 68.5 మిలియన్ల మంది ప్రజలు స్థాన చలనం పొందారని వెల్లడించింది. ప్రతి రోజూ దాదాపు 44,500 మంది ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారని, ప్రతి రెండు సెకన్లకు ఒకరు స్థానచలనం పొందుతున్నారని ఆ నివేదిక తెలిపింది. అమెరికాలో ఆశ్రయం కోరే వారి సంఖ్య బాగా పెరిగిపోయిందని ఐరాస నివేదిక వెల్లడించింది. ఉత్తర, మధ్య అమెరికా నుంచి శరణు కోరే వారు పెరుగుతూనే ఉన్నారు. అందులోనూ స్లావెడార్‌కు చెందిన వారు అత్యధికంగా 49,500 మంది ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2016లో స్లావెడార్ నుంచి 33,600 దరఖాస్తులు వచ్చాయి.

# సాధించే వరకూ ఉద్యమం ఆపను

## కడపలో స్టీల్‌ప్లాంట్ రావాల్సిందే.. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్




కడప: కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం స్థాపించేవరకూ ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తానని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ స్పష్టంచేశారు. ఉక్కు పరిశ్రమ రాకుండా కేంద్రం అడ్డుపడుతోందని మండిపడ్డారు. ఉక్కుకర్మాగారం స్థాపన కోసం ఎమ్మెల్సీ బీటెక్ రవితో కలిసి జడ్పీ కార్యాలయం వద్ద ఆమరణ దీక్ష చేపట్టారు. జిల్లాలో పరిశ్రమ సాధ్యం కాదని సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేసినా.. ప్రతిపక్ష నేత జగన్ ఒక్కమాటా మాట్లాడకపోవడం విచార కరమన్నారు. ఉక్కు పరిశ్రమ సాధన కోసం అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని బీటెక్ రవి చెప్పారు. దీక్ష చేస్తోన్న నేతలకు సంఘీభావంగా తెదేపా నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో దీక్ష స్థలికి తరలివచ్చారు. అంతకుముందు సీఎం రమేశ్ కడప నగరంలోని మహాత్మా గాంధీ, ఎన్టీ రామారావు, అంబేడ్కర్, కోటిరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉక్కు కర్మాగారం కోసం 350 రోజుల నుంచి ఆర్పీపీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సంద ర్శించి మద్దతు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారం నిర్మిస్తామంటూ చెప్పి ఇప్పుడు సాధ్యం కాదని చెప్పడం సరికాదన్నారు.

# అమెరికాలో 52 మంది భారతీయుల అరెస్టు

వాషింగ్టన్: అక్రమంగా అమెరికాలోకి చొరబడ్డారంటూ అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించిన వారిలో 52 మంది భారతీయులు ఉన్నారు. వాళ్లలో ఎక్కువ మంది సిక్కులు ఉన్నట్లు సమాచారం. మెక్సికో సరిహద్దు నుంచి అమెరికాలోకి అక్రమంగా చొరబడిన వీరు ఒరెగాన్ రాష్ట్రంలో ఆశ్రయం పొందడానికి ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకొని ఫెడరల్ నిర్బంధ కేంద్రంలో ఉంచారు. నిర్బంధ కేంద్ర సందర్శనానికి శనివారం వెళ్లిన చట్టసభ్యులు ఈ విషయాన్ని వెల్లడించారు. వీరితో కలిపి మొత్తం అక్కడ 123 మంది బందీలుగా ఉన్నట్లు తెలిపారు.

మిగిలిన వారంతా చైనా, మెక్సికో, నేపాల్, పాకిస్థాన్, ఉక్రెయిన్ తదితర దేశీయులని చెప్పారు. అయితే వీరంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చారా అనేది తెలియరాలేదు. రోజులో 22 గంటలు ఒక చిన్న గదిలో ముగ్గురిని ఉంచుతున్నారని,

పరిస్థితి నరకంగా ఉందని బందీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దేశంలోకి అక్రమంగా వలస వచ్చి చిక్కిన పిల్లలు 12000 వరకూ నిర్బంధ కేంద్రాల్లో ఉన్నారని, వారిలో 10000 మందిని వారి తల్లిదండ్రులే అక్రమంగా తరలించారని, మిగతావారూ తల్లిదండ్రులతో చట్ట విరుద్ధంగా వలస వచ్చి విడిపోయారని ట్రంప్ కార్యాలయం తెలిపింది.

# రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

## పరోక్షంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు బొత్స పిలుపు




విశాఖ సిటీః ప్రస్తుత తాజా రాజకీయాల్లో పార్టీలు మారడం అనేది ప్రక్రియలో భాగమేనని వైయస్సార్ పార్టీ నాయుకులు బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్న తరుణంలో ఏ పార్టీలో ఉంటే మనుగడ ఉంటుందో ఆ ఆ పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. అయితే ప్రస్తుతం వైసిపిలోకి చేరేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే ప్రభుత్వం జగన్మోహన్ ప్రభుత్వం ఏర్పడుతుందని అదే కారణంతో పార్టీలో జాయిన్ అయ్యే వారి సంఖ్య పెరుగుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే నీతి అయోగ్‌లో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడకపోవడం ఎక్కడ ఉన్నారు నాలుగేళ్ల చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగు చెంది ఉన్నారన్నారు. నాలుగేళ్లలో చంద్రబాబు మోసాలను ప్రజలకు చెప్పేందుకు ఈ నెల 30 న అనంతపూర్ లో వైస్సార్సీపీ ఆధ్వర్యంలో వంచనపై గర్జన.. నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 నుంచి 5 వరకు కార్యక్రమంలో హాజరు కానున్న వైస్సార్సీపీ ఎంపీ..ఎమ్మెల్యేలు.. ఢిల్లీ లో జరిగిన నీతి ఆయోగ్ సమావేశ ములో కేంద్రాన్ని నిలదీసే ఉంటే ప్రజల సమస్యలు తెలిసి ఉండేవి.. అని అన్నారు ..

సీఎం రాష్ట ప్రజల్ని వంచిస్తున్నారని బొత్స పేర్కొన్నారు . రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారని ఆవేదన చెందారు. ఎప్పుడు లేనివిధంగా 2లక్షల కోట్లు అప్పుల్లో రాష్ట్రం ఉందన్నారు. నాయి బ్రహ్మణుల్ని కించపరిచారు ఇది చాలా బాధాకరమన్నారు..బలహీన వర్గాలని చులకనగా సీఎం . చూడడం ఎలాంటి సందేశం ఇవ్వడం ఒక్కసారి ఆలోచించాలన్నారు. ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ సమస్యల పై ఏం మాట్లాతారో బహిర్గతం చేయాలి. చంద్రబాబును కోరారు. పరకాల ప్రభాకర్ రాజీనామా ఓ డ్రామా... అని తేల్చి పారేశారు రాజీనామా చేస్తే ఇంతకు ముందే చేయాలి.. అంటూ హేళన చేసారు. విశాఖలో భూముల వ్యవహారంపై వేసిన సిట్ నివేదిక బయటపెట్టాలి బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . బాధ్యులైన టీడీపీ మంత్రులు..ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలి. వైస్సార్సీపీ నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు.

### మంత్రి గంటా.. వైసీపీలోకా?
### నాకు తెలియదే!

మంత్రి గంటా శ్రీనివాసరావు వైసీపీలోకి వస్తున్నారన్న విషయం తనకు తెలియదని ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. పార్టీ విధానాలు నచ్చి ఎవరైనా వస్తే ఆహ్వానిస్తామని తెలిపారు. ఎవరొచ్చినా వారి పదవులకు రాజీనామా చేయాలన్నారు. జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర వచ్చే నెల 15 తర్వాత విశాఖలో ప్రారంభం అవుతుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు.

ఏపీ కేబినెట్‌లో మంత్రులుగా ఉన్న అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిన్న చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశానికి గంటా డుమ్మా కొట్టారు. అనారోగ్య కారణంగా గంటా గైర్హాజరైనట్లు చెబుతున్నా.. కారణం ఏదో ఉండొచ్చని నేతలు చర్చించుకుంటున్నారు.

# రిజర్వేషన్ అంటే బిక్ష కాదు

## -సెక్యూరిటీ సిబ్బందిచేత, లాఠీలతో, ప్రజలను కొట్టించే పాలన ఎప్పటికీ వద్దు
## -మనకు అండగా దళిత సోదరులు ఉన్నారు -కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం



కాకినాడ : ఇటీవల జగన్ ప్రజా సంకల్ప యాత్రలో జగన్ తన సిబ్బందితో ప్రజలపై దాడి చేయడం తెలిసిన విషయమే దీనిపై కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం స్పందిస్తూ రిజర్వేషన్ అంటే బిక్ష కాదు పోగొట్టుకున్న దానిని అడుగుతున్నాము ఎవరిని దేహి అని అడగవద్దు బలిజ తెళగ ఒంటరి కాపు వర్గాలకు బ్రిటీష్ వారి పరిపాలన నుండి దళిత మహానుభావుడు ఆనాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఇచ్చిన జీవో వరకు బీసీ రిజర్వేషన్ అనుభవించి బిజీగా రిజర్వేషన్ అనుభవించి బిసి గా ఉద్యోగంలో చేరి ఒ సి.గా రిటైర్ ఆయినవారు ఎందరో ఉన్నారని స్వతంత్రం వచ్చిన తరువాత నష్టపోయింది మీమే రిజర్వేషన్లు పోయాయి .వాటిని తిరిగి సంపాదించుకోవడం తప్పా ఇతర కుల సోదరుల హక్కులను హరించడానికో కృషి చేయడం లేదనే నిజాన్ని గ్రహించాలని ఆయన తెలియజేశారు ఒక పార్టీ నాయకులు మీ రిజర్వేషన్ పునరుద్ధరిస్తామని ఓట్లు వేయించుకుని లాఠీలతో గౌరవించారు మరొక పార్టీ నాయకులు ఆచరణ కానీ హామీ నేను ఇవ్వను అని చిరాకు పడుతూ ఉన్నట్లు పత్రికలలో టీవీలలో చూడడం జరిగింది మేము కూడా భారతదేశంలో భాగమైన ఆంధ్రప్రదేశ్లో పుట్టినవాళ్ళమే పరాయి దేశం నుండి వలస వచ్చిన వాళ్ళమ్ కాదు భారత రాజ్యాంగం మాకు వర్తిస్తుంది కాని మమ్మల్ని అణగారిన వారిగా అణచి వేసే కార్యక్రమాలు కొన్ని పార్టీలు తీసుకోస్తూన్నందుకు చాలా బాధ కలుగుతుంది ఎందుకు మాలాంటి అంటరానివారిని ఓట్లు అడుక్కుంటున్నారు మానేయండి మేము ఎవరి ఆస్తులు దోచిపెట్టమని అడ గనప్పుడు ఆ పార్టీల్లో ఎందుకు ఆ బాధా? హర్యానా గుజరాత్ రాజస్థాన్ రాష్ట్రాల్లో బిసి రిజర్వేషన్ అక్కడ కొన్ని కులాల వారు కొత్తగా అడుగుతున్నారు కానీ మేము అడిగేది ఒకప్పుడు అనుభవించిన పోగొట్టుకున్న రిజర్వేషన్ అని అందరు గుర్తించుకోవాలి మాకు అండగా దళిత సోదరులున్నారు అధికారం చూడని ఎన్నో కులాలు వారు ఉన్నారు అందరం కలిసి మార్పు కోసం ప్రయత్నం చేద్దాం అణచివేయబడ్డ అణగారిన కులాల వారికి వాటా ఇచ్చి తీరాలని డిమాండ్ చేద్దాం ప్రజల కోరికలు తీర్చడానికి ఇబ్బందులు ఉంటాయి అన్నప్పుడు మమ్మల్ని ఎందుకు ఓట్లు అడుక్కోవాలి వారికి అధికార కాంక్ష ఉండవచ్చు మాకు రిజర్వేషన్ పై అడిగే హక్కు లేదా?

రాబోయే ప్రభుత్వం ప్రజల అనుమతితో ప్రజాపాలన చేసేదిగా ఉండాలి గాని సెక్యురిటీ సిబ్బంది చేత,లాఠీలతో కొట్టించే పాలన ప్రజలకు ఎప్పటికీ వద్దని ముద్రగడ పద్మనాభం లేఖలో పేర్కొన్నారు.

# ఘనంగా చంద్రమౌళిశ్వరుల పక్షోత్సవాలు



విశాఖ సిటీః శ్రీ శారదాపీఠం స్వర్ణ మండపంలో జగద్గురువు శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో శ్రీ శారదా చంద్రమౌళిశ్వరులకు నేటి నుండి పక్షోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ శారదా అమ్మవారికి స్వర్ణ మండపంలో పంచామృతా భిషేకంతో పాటు కుంకుమార్చన జరిగింది. స్వామి వారు జూలై మాసంలో చాతుర్మాస దీక్ష నిమిత్తం రుషీకేష్ బయలుదేరే ముందుగా ఈ ఉత్సవాలు జరగడం భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ అకాడ సంబంధిత కాశీ మఠానికి బాబా అను వ్యక్తిని నాగసాంప్రదాయ సంతుకు మహా మండలేశ్వరునిగా నియమించిన నియామక పత్రాన్ని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి పీఠానికి విచ్చేసిన బాబాలు దేవతామూర్తులకు విశేష అర్చనలు గావించి స్వామి వారిని హిందూ ధర్మ పరీరక్షణకై మరియు రుషీకేష్ చాతుర్మాస దీక్షా సమయంలో ప్రతీ సంవత్సరములాగానే సాధుసంతుల సమావేశానికి హాజరు కావవసినదిగా వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. వారిని విశేష దక్షిణతో సత్కరింతారు. ఈ కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి శ్రీ బాలస్వామి వారు పాల్గొన్నారు.



# గవర్నర్ పాలనలో మా పని మరింత సులువు

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లో పీడీపీ-భాజపా మధ్య పొత్తు వీగిపోవడంతో ఆ రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించారు. గవర్నర్ పాలనకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ ఉదయం ఆమోదముద్ర వేశారు. దీంతో గవర్నర్ పాలన ఈ రోజు నుంచి అమల్లోకి వచ్చింది. మరోవైపు రాష్ట్రంలో ఉగ్రవాద కార్యకలాపాల నిర్మూలన చర్యలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆ రాష్ట్ర డీజీపీ శేషు పాల్ వైద్ తెలిపారు. గవర్నర్ పాలనలో తమ పని మరింత సులవవుతుందని ఆయన పేర్కొనడం గమనార్హం. రాష్ట్రంలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతోంది. కాల్పుల విరమణ ఒప్పందం సమయంలోనే ఇది నిలిచిపోయింది. దీన్ని మేం రాబోయే రోజుల్లో మరింత ఉద్ధృతం చేస్తాం. గవర్నర్ పాలనలో పని చేయడం మరింత సులువని నేను అనుకుంటున్నాను. అని వైద్ తెలిపారు. గవర్నర్ పాలన ప్రభావం ఎలా ఉంటుందని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. కాల్పుల విరమణ ఉగ్రవాదులకు ఊపిరినిచ్చినట్లైందని డీజీపీ పేర్కొన్నారు. ఈ సమయాన్ని ఉగ్రవాదులు వారికి అనుకూలంగా మార్చుకున్నారని తెలిపారు. కాల్పుల విరమణ సమయంలో ఉగ్రవాదుల కదలికలపై కచ్చితమైన సమాచారం ఉన్నప్పటికీ తాము ఏమీ చేయలేక పోయామని వివరించారు. అయితే ప్రస్తుతం మాత్రం ఆపరేషన్‌ను మరింత ఉద్ధృతం చేస్తామని చెప్పారు. అలాగే జర్నలిస్టు సుజాత్ బుఖారీ హత్య కేసును కూడా వీలైనంత త్వరగా ఛేదిస్తామని తెలిపారు. పీడీపీకి భాజపా మద్దతు ఉపసంహరించుకోవడంతో నిన్న మెహబూబా ముఫ్తీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## నాకు ప్రాణహాని ఉంది..
### తుపాకీ ఇప్పించండి
### మహేంద్ర సింగ్ ధోనీ భార్య సాక్షి

రాంచీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ భార్య సాక్షి తనకు ప్రాణ హాని ఉందని, లైసెన్స్ తుపాకీ ఇప్పించాలని కోరి నట్లు సమాచారం. క్రికెట్ మ్యాచ్‌ల దృష్ట్యా ధోనీ ఇంట్లో ఉండే సమయం చాలా తక్కువ.

నా కూతురితో కలిసి నేను మాత్రమే ఇంట్లో ఒంటరిగా ఉంటున్నా. ఏదైనా పని కోసం బయటకు వెళ్లాల్సి వచ్చినా ఒక్కదాన్నే వెళ్లాలి. నా భద్రతను దృష్టిలో పెట్టుకునే నాకు లైసెన్స్‌డ్ తుపాకీ లేదా రివాల్వర్ ఇప్పించాలి అని కోరినట్లు సాక్షి తెలిపింది.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

## జన్మభూమిలో పేరుకుపోతున్న అవినీతి



శ్రీకాకుళం: టీడీపీ ప్రభుత్వం, నేతలపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. టీడీపీ నేతలు అవినీతిలో పోటీ పడ్డారే తప్ప.. అభివృద్ధిలో కాదని అన్నారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జన్మభూమి కమిటీ సభ్యుడి నుంచి మంత్రి వరకు అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. అన్నం పెట్టిన చేతినే నరకటం చంద్రబాబు సహజ గుణం అని విమర్శిం చారు. సాయం చేసిన మోదీని మోసం చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని చంద్రబాబు వైఖరిని తూర్పారబట్టారు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో టీడీపీ డ్రామాలాడుతోందన్నారు.









VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com